## రూ. లక్ష దాటిన బంగారం ధర..



- నాలుగు రోజుల్లోనే రూ.4వేలకు పైగా హైక్!
- 24 క్యారెట్ల 10గ్రా బంగారం ధర రూ.1,01,680గా నమోదు

07

## మరో వివాదంలో సినీ నటి కల్పిక



- కేసు నమోదు
- ఆన్‌లైన్ వేదికగా నటి వేధింపులకు పాల్పడుతుందని కీర్తన అనే బాధితురాలి ఫిర్యాదు

06

## కావ్య మారన్‌తో అనిరుధ్ పెళ్లి?



- రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ కథనాలు
- 'పెళ్లా? రూమర్స్ ఆపండి' అంటూ అనిరుధ్ పోస్ట్
- ఆ వార్తల్లో నిజం లేదని కావ్య మారన్ టీమ్ వెల్లడి

08



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

ANN తెలుగు
Follow: @ANNTELUGU
15-06-2025
# మహా పత్రిక
హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 193 పేజీలు-08 వెల-రూ.6
HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## విచారణల తర్వాత?

తెలంగాణ పాలిటిక్స్ లో ఇపుడు విచారణల పర్వం కొనసాగుతోంది. ఈ జూన్ లోనే మాజీ మంత్రులు హరీష్ రావు, ఈటల రాజేందర్ తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు రూపకర్త, మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం జ్యుడిషియల్ కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. కేటీఆర్ సోమవారం ఫార్ములా కేసులో విచారణకు హాజరుకానుండగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావును విదేశాల నుండి రప్పించి విచారిస్తున్నారు. కాళేశ్వరం బిఆర్ఎస్ ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, విపక్ష నేత రాహుల్ గాంధీ సహా బిజెపి, కాంగ్రెస్ జాతీయ ప్రముఖులంతా ఆరోపించారు. ఇపుడు కాళేశ్వరం విచారణలో తర్వాత ఏం జరుగుతుందన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఓ వైపు విచారణల రాజకీయం సాగుతుండగానే, మరోవైపు కాంగ్రెస్ పార్టీ సైలెంట్ గా మంత్రివర్గ విస్తరణ చేసింది. ఎస్సీ, బిసిలకు మాత్రమే చోటు కల్పించి సామాజిక న్యాయానికి కాంగ్రెస్ బ్రాండ్ అని ప్రకటించుకుంది. సినీ అవార్డులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత పదేళ్లలో ముగ్గురు ముఖ్యమంత్రులు చేయలేనిది చేసి చూపించాడు.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో





## 27 ఏళ్ల నిరీక్షణకు తెర

- డబ్ల్యూటీసీ టైటిల్‌తో చరిత్ర సృష్టించిన సౌతాఫ్రికా
- దక్షిణాఫ్రికా ఖాతాలో తొలి ఐసీసీ టైటిల్
- 5 వికెట్ల తేడాతో కంగారూలను చిత్తు చేసిన సఫారీలు
- మార్‌క్రమ్ అద్భుత సెంచరీ.. బవుమా సారథ్యంలో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌గా సౌతాఫ్రికా

వివరాలు 2లో



## నీట్ ఫలితాలు విడుదల

- ఫలితాల్లో దేశవ్యాప్తంగా 12.36 లక్షల మంది అర్హత
- రాజస్థాన్‌కు చెందిన మహేశ్‌కుమార్‌కు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్
- రాష్ట్రానికి చెందిన కాకర్ల జీవన్ సాయికి 18 వ ర్యాంకు

వివరాలు 2లో





### జై తెలంగాణ అంటూ నినదించిన నటులు

2024లో పుష్ప 2 సినిమాకి గాను అల్లు అర్జున్ బెస్ట్ హీరోగా, 35 చిన్న కథ కాదు సినిమాకి గాను నివేదా థామస్ బెస్ట్ హీరోయిన్ గా సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఎన్‌టీఆర్ నేషనల్ అవార్డును నందమూరి బాలకృష్ణకు అందజేశారు. కాగా ఈ సందర్భంగా పలువురు నటులు జై తెలంగాణ అంటూ నినదించడం అందరినీ ఆకట్టుకుంది.

# అంగరంగ వైభవంగా...

## గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానం

### తరలివచ్చిన తారా లోకం

- అల్లు అర్జున్ ను హగ్ చేసుకున్న సీఎం రేవంత్
- పుష్ప అవార్డు అభిమానులకు అంకితం అల్లు అర్జున్
- గద్దరన్న అవార్డులు అభినందనీయం బాలయ్య
- మార్మోగిన తెలంగాణం.. దద్దరిల్లిన హైటెక్స్
- రాజమౌళి, సుకుమార్, విజయ్ దేవరకొండ, శర్వానంద్, పూజాహెగ్డే, జయసుధ సహ సినీప్రముఖుల హాజరు

వివరాలు 3లో

**మహా- హైదరాబాద్ :** తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శనివారం సాయంత్రం ఈ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులతోపాటు రాజకీయ ప్రముఖులు సైతం పెద్దఎత్తున హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అతిరథ మహారథుల ఆధ్వర్యంలో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం కన్నులపండువగా సాగుతోంది. టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ హీరోలు, హీరోయిన్లు, పలువురు సినీ, సాహిత్య, సాంస్కృతిక రంగాల ప్రముఖులు ఈ వేడుకకు హాజరు అయ్యారు.

## ఐటీ పరిశ్రమలాగే సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తాం

గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ -2024 కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

03



## రియల్ రంగానికి మళ్లీ రెక్కలు

### పెరిగిన రిజిస్ట్రేషన్ల రాబడి

**హైదరాబాద్, మహా**

తెలంగాణలో రియల్ రంగం క్రమ క్రమంగా పుంజుకుంటోంది. తెలంగాణ వ్యాప్తంగా ఇళ్ల స్థలాలు, ఫ్లాట్ల క్రయవిక్రయాలు గతేడాదితో పోలిస్తే పెరిగాయి. 202526 ఆర్థిక సంవత్సరంలో జూన్ రెండో వారం నాటికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రాబడిలో 17.72 శాతం వృద్ధి నమోదయిందని ఆ శాఖ తెలిపింది.

మిగతా 2లో



## పెరుగుతున్న ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలు

### ముడి చమురు, బంగారం ధరలు పెరిగే అవకాశం

**మహా:** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు మరో యుద్ధానికి దారి తీస్తాయనే ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. ఈ పరిణామాలతో ముడిచమురు ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉండగా, విమాన రాకపోకలకు సైతం తీవ్ర అంతరాయాలు ఏర్పడనున్నాయి.

వివరాలు 2లో

# ఏపీని ముందుకెళ్లకుండా ఆపండి

## గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ సర్కార్ అభ్యంతరం



- కేంద్రానికి లేఖ రాసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- హరీశ్ వాదనలు నిరాధారం.. జగన్, కేసీఆర్ అవగాహనతో ఏపీకి నీటిని దోచిపెట్టారని కౌంటర్

వివరాలు 2లో

## నిధులు, నదులు ఆంధ్రకేనా?

- తెలంగాణలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా.. చంద్రబాబు ప్రభుత్వమా?
- ఏపీ జల దోపిడీపై బీజేపీ, కాంగ్రెస్ ఎందుకు నోరు మెదపడం లేదు?
- మీ దోస్తానా కోసం తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెడతారా రేవంత్ రెడ్డి?
- ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్తుత్తి మాటలతోనే కాలం గడుపుతారా?
- పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ లో మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు

02

# ఏపీని ముందుకెళ్లకుండా ఆపండి

## గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు పై తెలంగాణ సర్కార్ అభ్యంతరం

### కేంద్రానికి లేఖ రాసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### హరీశ్ వాదనలు నిరాధారం.. జగన్-కేసీఆర్ అవగాహనతో ఏపీకి నీటిని దోచిపెట్టారని కౌంటర్



**మహా:** తెలంగాణ, ఏపీ రెండు తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరిబనకచర్ల ప్రాజెక్టు అంశం మరోమారు వివాదాస్పదమైంది. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని, దీనిని తక్షణమే అడ్డుకోవాలని ఆయన ఆ లేఖలో కోరారు. ఈ మేరకు ఈ నెల 13న జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు లేఖ రాసిన తెలంగాణ మంత్రి, ఏపీ ప్రీఫీజిబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని కోరారు. డీపీఆర్ సమర్పించకుండా నిలువరించాలని, టెండర్లు పిలవడం సహా ఏపీ ముందుకెళ్లకుండా చూడాలంటూ లేఖలో పేర్కొన్నారు.

**హరీశ్ రావు వాదనలు నిరాధారం..**

మరోవైపు బనకచర్ల ప్రాజెక్టుపై మాజీమంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపణలను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తోసిపుచ్చారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా, నిర్ణయాత్మకంగా వ్యవహరించిందని వివరించారు. ఏపీ సీఎం నిధుల కోసం కేంద్రానికి లేఖ రాసిన వెంటనే, జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాసి అభ్యంతరాలు తెలిపామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మౌనం వహించలేదని, మొదట్నుంచీ చట్టపరంగా ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. హరీశ్ రావు వాదనలు నిరాధారం, తప్పుదారి పట్టించేలా ఉన్నాయన్నారు.

**కేసీఆర్ చోద్యం చూశారు..**

నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తెలంగాణకు కృష్ణానదిలో నీటి కేటాయింపులను కేవలం 299 టీఎంసీలకు మాత్రమే పరిమితం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి నీటిని పెద్దమొత్తంలో తరలించారని గుర్తు చేశారు. రాయలసీమ ఎత్తిపోతల టెండర్లు ఖరారైనప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్‌ను సంప్రదించలేదని వివరించారు. ఆంధ్రప్రదేశ్ రోజూ 3 టీఎంసీల నీటిని మళ్లిస్తోంటే కేసీఆర్ చోద్యం చూశారని, జగన్‌తో అవగాహనతోనే కేసీఆర్ తెలంగాణ నీటిని ఏపీ దోపిడీ చేసేలా అనుమతి ఇచ్చారని ఆరోపించారు.

# పెరుగుతున్న ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలు

## ముడి చమురు, బంగారం ధరలు పెరిగే అవకాశం



**మహా:** ఇజ్రాయెల్ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు మరో యుద్ధానికి దారి తీస్తాయనే ఆందోళనలు తీవ్రమవుతున్నాయి. ఈ పరిణామాలతో ముడిచమురు ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉండగా, విమాన రాకపోకలకు సైతం తీవ్ర అంతరాయాలు ఏర్పడనున్నాయి. అమెరికాతో ఇరాన్ అణు చర్చలు కూడా నిలిచిపోయినట్లేనని ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ప్రపంచ స్థాయిలో ఏ అంశాలపై ప్రభావం చూపిస్తాయనే చర్చ జరుగుతోంది.

**ముడిచమురు ధరలు భారీగా పెరిగే అవకాశం**

ఇజ్రాయెల్ చేపట్టిన ఆపరేషన్ లయన్, తర్వాత ఇరాన్ ప్రతీకార దాడులు పూర్తిస్థాయి యుద్ధానికి దారితీస్తుండగా, ఇది ప్రపంచ దేశాలపై అనేక ప్రతికూల ప్రభావాలకు కారణం అవుతున్నాయి. ముఖ్యంగా ముడిచమురు ధరలు భారీగా పెరగనున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర 9 శాతం పెరిగి, బ్యారెల్ 78 డాలర్లకు చేరుకుంటుందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఇరాన్ నుంచి సరఫరాలో అంతరాయాల కారణంగా ముడిచమురు ధరలకు రెక్కలు వస్తున్నాయి. ఫలితంగా డీజిల్, పెట్రోల్ ధరలు కూడా పెరగనున్నాయి. ఇరాన్ నిత్యం 3.3 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురు ఉత్పత్తి చేస్తుంది. 1.5 మిలియన్ బ్యారెళ్లను ఎగుమతి చేస్తుంది. ప్రపంచ చమురు వాణిజ్యంలో 20 శాతం హోర్ముజ్ జలసంధి ద్వారా సాగుతుంది. తమపై దాడులు చేస్తే ఈ రవాణాను అడ్డుకుంటామని గతంలో ఇరాన్ హెచ్చరించింది. ప్రస్తుతానికి సౌదీఅరేబియా, యూఏఇ నుంచి ముడిచమురు సరఫరా తాత్కాలికంగా సమస్యను తీవ్రం కాకుండా అడ్డుకునే అవకాశం ఉంది. ఒకవేళ ఇరాన్ జలసంధిని మూసివేస్తే ముడిచమురు ధరలు 120 డాలర్ల నుంచి 130 డాలర్లకు పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**బంగారం మరింత ప్రియం.. పెరగనున్న ధరలు**

ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఘర్షణల వల్ల బంగారం ధరలు కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే, యుద్ధాల సమయంలో పెట్టుబడిదారులు నష్టభయం లేని మార్గాల్లోకి తమ డబ్బులను మళ్లిస్తారు. కనుక సేఫ్ హెవెన్ అయిన బంగారంపై పెట్టుబడులు పెడతారు. దీని వల్ల సహజంగానే బంగారం ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇది సామాన్యులకు భారంగా మారుతుంది.

**ఎగుమతి ఖర్చులు పెరిగే ఛాన్స్**

సూయజ్ కెనాల్, ఎర్ర సముద్ర మార్గాలను మూసివేత ఫలితంగా భారత్ ఎగుమతులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. ఇజ్రాయెల్ఇరాన్ ఘర్షణల వల్ల ఇండియన్ ఎక్స్‌పోర్ట్స్‌ను వేరే మార్గాలకు మళ్లించాల్సి ఉంటుంది. దీని వల్ల ఖచ్చితంగా రవాణా ఖర్చులు పెరుగుతాయి. సూయజ్ కాలువ, ఎర్ర సముద్ర మార్గాలు మూసివేయడం వల్ల ఇండియన్ షిప్స్ కేప్ ఆఫ్ గుడ్ హోప్‌ను దాటి వెళ్లాల్సి వస్తుంది. దీని వల్ల అవి గమ్యస్థానానికి చేరడానికి 15 నుంచి 20 రోజులు పడుతుంది. ఈ ఆలస్యం మూలంగా ఒక్కో కంటైనర్‌పై 5001000 డాలర్ల వరకు అదనపు భారం పడుతుంది. ఫలితంగా ఎగుమతుల ఖర్చులు 4050 శాతం వరకు పెరిగే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు.

# 27 ఏళ్ల నిరీక్షణకు తెర

## డబ్ల్యూటీసీ టైటిల్‌తో చరిత్ర సృష్టించిన సౌతాఫ్రికా

### దక్షిణాఫ్రికా ఖాతాలో తొలి ఐసీసీ టైటిల్.. 5 వికెట్ల తేడాతో కంగారూలను చిత్తు చేసిన సఫారీలు

### మార్‌క్రమ్ అద్భుత సెంచరీ.. బవుమా సారథ్యంలో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌గా సౌతాఫ్రికా




**మహా:** వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 202325లో సౌతాఫ్రికా విజేతగా నిలిచింది. ప్రఖ్యాత లార్డ్స్ మైదానం వేదికగా శనివారం ముగిసిన ఫైనల్లో సమష్టిగా రాణించిన సౌతాఫ్రికా 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. 213/2 ఓవర్ నైట్ స్కోర్‌తో నాలుగు రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికా.. 83.4 ఓవర్లలో 5 వికెట్లకు 282 పరుగులు చేసి గెలుపొందింది. ఓవర్‌నైట్ బ్యాటర్ టెంబా బవుమా(134 బంతుల్లో 5 ఫోర్లతో 66) ఒకే ఒక్క పరుగు జోడించి వెనుదిరిగినా.. ట్రిస్టన్ స్టబ్స్(43 బంతుల్లో 8) నిరాశపర్చినా.. డేవిడ్ బెడింగ్‌హమ్(49 బంతుల్లో ఫోర్‌తో 21 నాటౌట్)తో కలిసి మార్క్‌రమ్(207 బంతుల్లో 14 ఫోర్లతో 136) జట్టును విజయం ముంగింట నిలబెట్టాడు. చివర్లో మార్క్‌రమ్ ఔటైనా.. వెర్రెన్నే(4 నాటౌట్)తో కలిసి బెడింగ్‌హమ్ విజయ లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు తీయగా.. ప్యాట్ కమిన్స్, జోష్‌హజెల్‌వుడ్ చెరో వికెట్ పడగొట్టారు.

**శతకంతో గెలిపించిన మార్క్‌రమ్ మామ..**

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులు చేసింది. స్మిత్(66), బ్యూ వెబ్‌స్టర్(72) హాఫ్ సెంచరీలతో రాణించగా.. రబడా(5/51) ఐదు వికెట్లతో సత్తా చాటాడు. అనంతరం సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 138 పరుగులకే కుప్పకూలింది. డేవిడ్ బెడింగ్‌హమ్(45) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ప్యాట్ కమిన్స్(6/28) సఫారీ పతనాన్ని శాసించింది. 74 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ 207 పరుగులు చేసింది. మిచెల్ స్టార్క్(58 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు. కగిసో రబడా(4/59) నాలుగు వికెట్లు తీసాడు. 282 పరుగుల లక్ష్యచేధనకు దిగిన సౌతాఫ్రికా.. మార్క్‌మర్ సెంచరీ, టెంబా బవుమా హాఫ్ సెంచరీతో లక్ష్యాన్ని చేధించింది. ఈ విజయంతో సౌతాఫ్రికా ఆటగాళ్లంతా కన్నీటి పర్యంతమయ్యారు.

**సంక్షిప్త స్కోర్లు:**

ఆసీస్ తొలి ఇన్నింగ్స్: 212 ఆలౌట్
సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్
ఆసీస్ రెండో ఇన్నింగ్స్: 207 ఆలౌట్
సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 83.4 ఓవర్లలో 282/5



# మళ్లీ రెక్కలు

## పెరిగిన రిజిస్ట్రేషన్ల రాబడి

చర, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా రెండున్నర నెలల్లో సమకూరిన ఆదాయం సానుకూలతకు అద్దం పడుతోందని అధికారులు పేర్కొంటున్నారు. 2023, 2024 సంవత్సరాల్లో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ప్రభావం, దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న స్తబ్ధతతో రియల్ ఎస్టేట్ రంగంలో గత ఏడాది పెద్దగా వృద్ధి నమోదు కాలేదు. అప్పటితో పోలిస్తే ఈ ఏడాది పరిస్థితులు కొంతమేర ఆశాజనకంగా ఉన్నాయని ఆ శాఖ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


**డాక్యుమెంట్లు కూడా...**

డాక్యుమెంట్ల పరంగా చూసినా వృద్ధి నమోదైంది. 2024లో ఏప్రిల్, మే, జూన్ నెల(రెండు వారాలు)ల్లో 3.24 లక్షల రిజిస్ట్రేషన్లు జరగగా, ఈ ఏడాది అదే రెండున్నర నెలల్లో 3.37 లక్షల(4 శాతం వృద్ధి) రిజిస్ట్రేషన్లు జరిగాయి. హైదరాబాద్ సరిహద్దు జిల్లాల్లో మార్కెట్ ధరలకు, రిజిస్ట్రేషన్ల విలువకు మధ్య పెద్ద ఎత్తున వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో ఎక్కువ రాబడి కోల్పోతున్నామని ధరల సవరణను ప్రభుత్వం వద్ద అధికారులు ప్రస్తావించినట్టు తెలిసింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్ విలువలు సవరిస్తే రియల్ ఎస్టేట్ రంగం వృద్ధిపై ఆ ప్రభావం ఇబ్బందికరంగా ఉంటుందని, ఇప్పట్లో సవరణ వద్దని పలువురు అధికారులు ప్రభుత్వ పెద్దలకు సూచించినట్లు తెలిసింది.

# నిధులు, నదులు ఆంధ్రకేనా?

## తెలంగాణలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా.. చంద్రబాబు ప్రభుత్వమా?

- ఏపీ జల దోపిడీపై బీజేపీ, కాంగ్రెస్ ఎందుకు నోరు మెదపడం లేదు?
- మీ దోస్తానా కోసం తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెడతారా రేవంత్ రెడ్డి?
- ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్తుత్తి మాటలతోనే కాలం గడుపుతారా?
- పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ లో మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు




**మహా:** రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేవలం ఉత్తుత్తి మాటలతో కాలం గడుపుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు దుయ్యబట్టారు. కృష్ణా నదీ జలాలను అక్రమంగా తరలించుకుపోవడానికి పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ఏ విధంగా ఉపయోగపడిందో, అదే విధంగా గోదావరి జలాలను తరలించుకోవడానికి బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు ఉపయోగపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గోదావరిబనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఆయన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పలు కీలక విషయాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుంటే, తెలంగాణ ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

**రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంకా నిద్రలోనే..**

"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణ పనులను చురుగ్గా చేపడుతుంటే, మన ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది" అని హరీశ్ రావు విమర్శించారు. ఈ నెలాఖరు నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తుంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంకా నిద్రలోనే ఉందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి కూడా ముందుకు రావడం లేదని, కేటీఆర్‌పై ఎలా కేసులు పెట్టాలనే దానిపై ఉన్న శ్రద్ధ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో లేదని ఆయన అన్నారు.

**ఢిల్లీ పాలకుల తీరు..**

కేంద్ర ప్రభుత్వ వైఖరిని కూడా హరీశ్ రావు తప్పుపట్టారు. "గత రెండు కేంద్ర బడ్జెట్లను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద పారుతుంటే, తెలంగాణకు మాత్రం గుండు సున్నా దక్కింది. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే అన్నట్లుగా ఢిల్లీ పాలకుల తీరు ఉంది" అని ఆయన అన్నారు. నిధుల కేటాయింపుల్లో, నదీ జలాల పంపకాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు నోరు మెదపడం లేదని, రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కూడా స్పందించడం లేదని విమర్శించారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు ఇచ్చి మరీ సహకరిస్తోందని, తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు.

**ఏపీ అక్రమ ప్రాజెక్టు కడుతుంటే..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2 టీఎంసీల బాబ్లీ నీటి కోసం 2008లో చంద్రబాబు పోరాటం చేశారని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఏకంగా 200 టీఎంసీల నీటితో ఏపీ అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంతటి పోరాటం చేయాలో ఆలోచించాలని హరీశ్ రావు అన్నారు. తమకు రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే ముఖ్యమని స్పష్టం చేశారు. 'ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరిబనకచర్లను అడ్డుకోండి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుంది. మీరు ముందుకు రాకపోతే, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు బీఆర్ఎస్ పార్టీనే పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంది' అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



# డ్యాన్స్ మాస్టర్ కోసం రోజా, మీనా, రంభ, దేవయాని

రోజా, మీనా, రంభ, దేవయాని ఒకే ఫ్రేమ్ లో.. ఒకే ప్లేస్ లో ఉండి సందడి చేశారు. 12 సంవత్సరాల వయసులోనే కళా మాస్టర్ అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా అరంగేట్రం చేసి రికార్డ్ క్రియేట్ చేశారు. వివిధ భాషలలో 4000కి పైగా పాటలకు కొరియోగ్రాఫర్‌గా పనిచేశారు.1990 సమయంలో రోజా, మీనా, రంభ, దేవయానిలు నటించిన చాలా సినిమాలకు ఆమె కొరియోగ్రాఫర్‌గా పనిచేశారు. వారితో మంచి స్నేహం ఉండటం వల్ల తాజాగా చెన్నైలో కలిశామని, అందరం కలిసి మంచి భోజనం చేశామని కళా మాస్టర్ ఫోటోలు షేర్ చేశారు. ఇవి సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.



## సీఎంను కలిసిన ఫయిమ్

రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఎంఏ ఫయిమ్ శనివారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో ఆయన సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనపై నమ్మకంతో ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఫయిమ్ హామీ ఇచ్చారు. కాగా పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్, జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డిలకు ఫయిమ్ కృతజ్ఞతలు తెలిపారు.

### బీసీ బిల్లు అమలు చేసిన తర్వాతే

# ఎన్నికలు నిర్వహించాలి

## బీసీలకు 42 రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే ఊరుకోం

### మోసం చేయాలని ప్రయత్నిస్తే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని చేపడతాం

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**మహా:** సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలని, ఈ లక్ష్య సాధనకు విద్యార్థిలోకం కదలిరావాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండి కొట్లాడారని, తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారని గుర్తు చేసిన ఎమ్మెల్సీ కవిత... అదే స్పూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలని అన్నారు. బీజేవైఎం నాయకుడు సాయి నాథ్ తో పాటు వివిధ విద్యార్థి సంఘాలకు చెందిన నాయకులు, విద్యార్థులు శనివారం నాడు పెద్ద ఎత్తున తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి ఎమ్మెల్సీ కవిత తన నివాసంలో కండువా కప్పి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. రాష్ట్ర చట్టసభలు ఆమోదించిన బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్ లో ఉండగానే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదని సూచించారు. బీసీలకు 42 రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోమని తేల్చిచెప్పారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని తేల్చిచెప్పారు. రిజర్వేషన్లు కల్పించకుండా మోసం చేయాలని ప్రయత్నిస్తే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని స్పష్టం చేశారు.

**దర్శనాల సంగతి పక్కనబెట్టి..**

కర్ణాటకలో కులగణన ఎలా చేయాలో అక్కడి సీఎం సిద్దరామయ్యకు నేర్పించానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని, కానీ సీఎం ఈ ప్రకటన చేసిన గంట సేపటికే కాంగ్రెస్ అధికారికంగా ఒక ఫోటో విడుదల చేసిందని, అందులో ఆ ఫోటోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్దరామయ్య, డీకే శివ కుమార్ ఉన్నారు కానీ రేవంత్ రెడ్డి మాత్రం లేరని ఎద్దేవా చేశారు. దీన్ని బట్టే రేవంత్ రెడ్డి ఎన్ని అబద్ధాలు ఆడుతున్నారో అర్థమవుతోందని తెలిపారు. రాహుల్ గాంధీ దర్శనం లేక సీఎం రేవంత్ రెడ్డి విలవిలలాడుతున్నారని విమర్శించారు. దర్శనాల సంగతి పక్కనబెట్టి ప్రజా సమస్యలపై సీఎం దృష్టిపెట్టాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ స్కూల్, టీడీపీ కాలేజీలో చదువుకున్నానని.. జాబ్ కాంగ్రెస్ లో చేస్తున్నానని సీఎం అన్నారని, చేస్తున్న జాబ్ లో కూడా రేవంత్ రెడ్డికి పాస్ మార్కులు రావడం లేదని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ చేశారని విమర్శించారు. కనీసం మంత్రివర్గాన్ని కూర్చు కూడా చేసుకోవడం ముఖ్యమంత్రికి చేతకావడం లేదని, ఇంత అసమర్థ, బలహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఇంత బలహీనంగా లేకుండేనని తెలిపారు.

# ఒక్క దయ్యానికే నోటీసులొచ్చాయి!

## దానికే ఎందుకు తట్టుకోలేక పోతున్నారు

### ప్రజల సొమ్మును దోచుకుంటే ఏజెన్సీలు దర్యాప్తు చేయడం తప్పా?

### కేసీఆర్ ఓవర్ కాన్ఫిడెన్స్ వల్లే కాళేశ్వరం కుప్పకూలింది

### బీఆర్ఎస్ నేతలపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్



**మహా:** ప్రజల సొమ్మును దోచుకుంటే ఏజెన్సీలు దర్యాప్తు చేయడం తప్పా అని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవకతవకల మీద ఎంక్వైరీ జరుగుతున్నాయని ఇందులో కక్ష సాధింపు చర్యలు ఏముందని నిలదీశారు. శనివారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ.. ఇవాళ మేము ఒళ్లు దగ్గర పెట్టుకుని పరిపాలన చేయకుండా తప్పులు చేస్తే రేపు మాపై కూడా కమిషన్లు వస్తాయన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న వారు ఏడాదిన్నర పరిపాలించిన మాపై ఫ్రస్టేషన్ తో మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కేటీఆర్ కంటే మంచి ఇంగ్లీష్ వచ్చిన ప్రతిపక్షనాయుకులు చాలా మంది ఉన్నారని వారెవరు బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఇంతలా విషబీజాలు నాటలేదన్నారు. నిన్నటి వరకు దయ్యాలు అని మాట్లాడిన సిస్టర్ ఇవాళ సెంటిమెంట్ స్టార్ట్ చేశారని కేసీఆర్ ఫ్యామిలీ డ్రామా ఎన్ని ఎపిసోడ్స్ అయినా నడుస్తుందన్నారు. ఒక్క దయ్యానికి నోటీసులు ఇస్తేనే తట్టుకోలేకపోతున్నారన్నారు. తెలంగాణ సమాజాన్ని 24 గంటలు తప్పుదోవ పట్టించాలనే ఆలోచనతోనే కేసీఆర్ కుటుంబం ఉందనే విషయం క్లియర్ గా అర్థం అవుతోందన్నారు.

**డైవర్షన్ పాలిటిక్స్ అవసరంలేదు..**

ప్రభుత్వం బ్రహ్మాండంగా పని చేస్తోందని అందుకే మాకు డైవర్షన్ పాలిటిక్స్ అవసరంలేదన్నారు. ప్రతిపక్షాలు తమ పాత్రను సక్రమంగా నెరవేర్చడం లేదని ప్రతిపక్ష నాయకుడు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, ఆయనకు అసెంబ్లీకి వచ్చే ఓపిక లేదన్నారు. మా సీఎం, మా మంత్రులు ప్రతిరోజు ప్రజల్లో ఉంటున్నారని ప్రతిపక్ష హోదా అంటే ట్వీట్లు చేయడం కాదని సెటైర్ వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు సక్రమంగా నిర్మించి పంటలకు నీళ్లిస్తే ఇవాళ పీసీ ఘోష్ కమిషన్ రావాల్సిన అసరం ఏమొచ్చిందని నిలదీశారు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును చైనా వంటి దేశాలే 18 ఏళ్లలో నిర్మిస్తాయని అలాంటిది కేసీఆర్ నాలుగేళ్లలోనే నిర్మించారని కేటీఆర్ చెబుతున్నారంటేనే కమీషన్లు దండుకునేందుకే తొందరగా నిర్మించినట్లు అర్థం అవుతున్నదన్నారు. నాడు కమీషన్లకు కక్కుర్తి పడకుంటే నేడు పీసీ ఘోష్ కమిషన్ వచ్చేదే కాదన్నారు. ఇది కక్ష సాధింపు రాజకీయాలు కావని కేవలం మీరు చేసిన ఖర్మపాలనకు అనుభవిస్తున్న పరిస్థితి అన్నారు. కేసీఆర్ అయినట్లు మేము మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేను కాదల్చుకోలేదన్నారు. కేసీఆర్ ఓవర్ కాన్ఫిడెన్స్ వల్లే కాళేశ్వరం కుప్పకూలిందని ఆరోపించారు.





# అంగరంగ వైభవంగా...

## గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానం















(మహా- హైదరాబాద్ )

తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శనివారం సాయంత్రం ఈ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖలతోపాటు రాజకీయ ప్రముఖులు సైతం పెద్దఎత్తున హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అతిరథ మహారథుల ఆధ్వర్యంలో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం కన్నులపండువగా సాగుతోంది. టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ హీరోలు, హీరోయిన్లు, పలువురు సినీ, సాహిత్య, సాంస్కృతిక రంగాల ప్రముఖులు ఈ వేడుకకు హాజరు అయ్యారు. విజేతలకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా భారీ మొత్తంలో నగదు బహుమతులు అందజేస్తున్నారు. అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా 20142023 జ్యూరీ కమిటీ చైర్మన్ మురళీ మోహన్ డిప్యూటీ సీఎం భట్టి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి చేతుల మీదుగా చిరు సత్కారం చేశారు. అలాగే జ్యూరీ కమిటీ మెంబర్ దశరథ్, డీవీకే రాజులకు చిరు సత్కారం, గోల్డెన్ మొమెంటో ప్రదానం చేశారు. జ్యూరీ కమిటీ మెంబర్లు ఊహ, డైరెక్టర్ ఉమా మహేశ్వర్ రావు , వనజా ఉదయ్, కూచిపూడి వెంకట్, మధుర శ్రీధర్, జయసుధ, సహా మిగతా వారికి గోల్డ్ మొమెంటో అందచేశారు.ఈ సందర్భంగా గద్దర్ ఫౌండేషన్ కు రూ.3 కోట్ల నిధులు మంజూరు చేశారు. భారీ సంఖ్యలో సినీ తారలు రావడంతో హైటెక్స్ ప్రాంగణం మొత్తం సందడిగా మారింది. రాజమౌళి, అల్లు అర్జున్‌తో పాటు నందమూరి బాలయ్య, విజయ్ దేవరకొండ, సుకుమార్, నాగ్అశ్విన్, పూజాహెగ్డే, జయసుధ, జయప్రధ, సుహాసిని, రీతూ, అనన్య, నాగవంశీ, వివివినాయక్, మహి, ప్రియదర్శి హాజరయ్యారు.

**జయజయహే తెలంగాణ**

ఈ కార్యక్రమంలో జయజయ హే గీతాన్ని కీరవాణి లైవ్ లో పర్ఫార్మ్ చేశారు. జయసుధ, జయప్రద, సుహాసిని చేతుల మీదుగా దేవర సినిమాకు గాను ఆయుధ పూజ కొరియోగ్రఫీ చేసినందుకు గణేష్ ఆచార్యకు బెస్ట్ కొరియోగ్రాఫర్ అవార్డు అందుకున్నారు. గాంగ్‌స్టార్ సినిమాకు గాను యాక్షన్ కొరియోగ్రఫీ చేసినందుకు కె. చంద్రశేఖర్ రాథోడ్ బెస్ట్ యాక్షన్ కొరియోగ్రాఫర్ అవార్డు అందుకున్నారు. మత్తు వదలరా 2 సినిమాకు గాను సత్య, వెన్నెల కిషోర్ ఇద్దరూ బెస్ట్ కమెడియన్స్ అవార్డు అందుకున్నారు. చెరో రెండున్నర లక్షల ప్రైజ్ మనీతో పాటు మొమెంటోలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు సినిమాకు గాను శరణ్య ప్రదీప్ బెస్ట్ సపోర్టింగ్ యాక్ట్రెస్ అవార్డు అందుకున్నారు. 3 లక్షల ప్రైజ్ మనీతో పాటు మొమెంటో, ప్రశంసా పత్రం అందుకున్నారు. కమిటీ కుర్రాళ్లు, ఆయ్,35 చిన్న కథ కాదుచ,, సరిపోదా శనివారం తదితర సినిమాలకు అవార్డులు అందజేశారు. కాగా 2024లో కల్కి 2989 ఏడీ ప్రథమ ఉత్తమ చిత్రంగా,పోట్టెల్ ద్వితీయ ఉత్తమ చిత్రం,లక్కీ భాస్కర్ తృతీయ ఉత్తమ చిత్రాలుగా అవార్డులు అందుకున్నాయి. కల్కి 2898 ఏడీ సినిమాకి గాను దర్శకుడు నాగ్ అశ్విన్ బెస్ట్ డైరెక్టర్ గా అవార్డు అందుకున్నారు.

**సీఎం రేవంత్ ముందు అల్లుఅర్జున్ డైలాగ్స్**

హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా జరుగుతోన్న గద్దర్ సినీ అవార్డుల ప్రదానోత్సవంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బెస్ట్ యాక్టర్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడారు. ఇంతటి ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడం నాకు చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అల్లు అర్జున్ ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. అంతేగాకుండా.. ఈ సందర్భంగా పుష్ప2 సినిమాలోని డైలాగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి పర్మిషన్‌తో అల్లు అర్జున్ చెప్పారు. 'ఆ బిడ్డ మీద ఒక్క గీత పడినా.. గంగమ్మ తల్లి జాతరలో యాట తల నరికినట్లు రప్పా రప్పా నరుకుతా.. పుష్ప.. పుష్పరాజ్.. అస్సలు తగ్గేదే లే' అంటూ అల్లు అర్జున్ డైలాగ్ చెప్పారు. దీంతో ఆడిటోరియం మొత్తం దద్దరిల్లింది.

**గద్దరన్నకు ఇది శాశ్వత గుర్తింపు: బాలయ్య**

గద్దరన్న పేరుతో సినీ నటులకు అవార్డులిచ్చి ఆయనకు శాశ్వత గుర్తింపు ఇచ్చారని నటుడు, ఎమ్మెల్యే బాలయ్య అన్నారు. తెలంగాణ గద్దర్ అవార్డ్స్ కార్యక్రమం హైదరాబాద్ ఐటెక్స్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు ను సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బాలయ్య అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కళలకు చావు లేదు. తెలంగాణ ముద్దు బిడ్డ గద్దరన్న పేరు మీద అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. దళిత కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదిగి ఆయనకంటూ ప్రత్యేక స్థానాన్ని గద్దర్ సంపాదించుకున్నారు. గద్దరన్న పేరుతో అవార్డులు ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. విశ్వాసానికే విశ్వనట రూపం ఎలా ఉంటుందో చూపించిన కారణజన్ముడు నందమూరి తారక రామారావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ అవార్డులను ప్రారంభించారు. రాష్ట్రాలు వేరు అయినా మనమంతా తెలుగువాళ్లమే. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో చలన చిత్ర ఉత్సవాన్ని జరుపుతుందన్నందుకు, అందులో నాకు అవార్డు రావడం సంతోషంగా ఉంది. ఎన్టీఆర్ తనయుడిగా ఆ అవార్డును తెలంగాణలో మొట్టమొదటి సారి గ్రహీతను అవడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. అవార్డుతో పాటు ఇచ్చారని, ఆ డబ్బును బసవతారకం ఆస్పత్రి సేవలకు వినియోగిస్తాం." అని బాలయ్య తెలిపారు.



### ఐటీ పరిశ్రమలాగే సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తాం

**గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ -2024 కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి**

మహా: ఐటీ పరిశ్రమలాగే సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2024 కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సినీ పరిశ్రమను గౌరవించి 1964 లో నంది అవార్డులు ఇవ్వాలని ఆనాడు నిర్ణయం తీసుకుందని, ఆ అనవాయితీ ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత ఇపుడు గద్దర్ పేరుతో అవార్డులు అందిస్తున్నామన్నారు. భారతీయ సినీ పరిశ్రమ అంటే తెలుగు సినీ పరిశ్రమ అని, తెలుగు సినీ పరిశ్రమకు హైదరాబాద్ వేదికైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొంత కఠినంగా కనిపించినా అది మీ అభివృద్ధి కోసమేనని, మీకు ఏం కావాలో నాకు చెప్పండి... రాష్ట్ర ప్రభుత్వం మీకు అండగా ఉంటుందన్నారు. మరో 22 ఏండ్లు తాను క్రియాశీల రాజకీయాల్లో ఉంటానని, ఏ హోదాలో ఉన్నా సినీ పరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఐటీ పరిశ్రమలాగే సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తామని, 2047 విజన్ డాక్యుమెంట్ లో సినీ పరిశ్రమ అభివృద్ధికి ఒక అధ్యాయం ఉంటుందని, 2047 నాటికి రాష్ట్ర ఏకానమీని 3 మిలియన్ డాలర్లకు చేరుస్తామన్నారు. గద్దరన్న అంటే ఒక విప్లవం.. ఒక వేగుచుక్క అన్నారు. గద్దరన్న తమకు ఒక స్ఫూర్తి అని, ఆ స్ఫూర్తితోనే తాము పోరాటాలు చేశామన్నారు. తెలంగాణ అభివృద్ధికి మీ అందరి సహకారం ఉండాలని సినీ పరిశ్రమకు విజ్ఞప్తిచేశారు.

## అదిరేలా సినీ పండుగ

**హైదరాబాద్:** తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం హైటెక్స్‌లో ఘనంగా మొదలైంది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు, ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభించారు. సినీ ప్రముఖులు బాలకృష్ణ, అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, నాగ్ అశ్విన్, సుకుమార్, మణితర్నం, సుహాసిని తదితరులు సందడి చేశారు. పలువురు విజేతలకు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి అవార్డులు అందజేశారు. మెమెంటోతోపాటు నగదు పురస్కారం, ప్రశంసా పత్రం అందించారు.

**ఎవరెవరు ఏ విభాగంలో అవార్డు అందుకున్నారంటే..?**

**ఉత్తమ నటుడు:** అల్లు అర్జున్
**ఉత్తమ నటి:** నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
**ఉత్తమ దర్శకుడు:** నాగ్ అశ్విన్
**ప్రథమ ఉత్తమ చిత్రం:** కల్కి 2898 ఏడీ
**ద్వితీయ ఉత్తమ చిత్రం:** పొట్టేల్
**తృతీయ ఉత్తమ చిత్రం:** లక్కీ భాస్కర్
**ఉత్తమ బాలల చిత్రం:** 35 చిన్న కథ కాదు
**ఉత్తమ ప్రజాదరణ చిత్రం:** ఆయ్: మేం ఫ్రెండ్సండీ
**ఉత్తమ సహాయ నటుడు:** ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
**ఉత్తమ సహాయ నటి:** శరణ్య (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)
**ఉత్తమ సంగీత దర్శకుడు:** భీమ్స్ సిసిరోలియో (రజాకార్)
**ఉత్తమ నేపథ్య గాయకుడు:** సిద్ శ్రీరామ్: ఊరు భైరవ కోన (నిజమే నే చెబుతున్నా)
**ఉత్తమ నేపథ్య గాయని:** శ్రేయా ఘోషల్: పుష్ప2 (సూసేకి అగ్గిరవ్వ మాదిరి..) (హాజరు కాలేదు)
**ఉత్తమ కొరియోగ్రాఫర్:** గణేష్ ఆచార్య (దేవరఆయుధపూజ)
**ఉత్తమ యాక్షన్ కొరియోగ్రఫీ:** చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్)
**ఉత్తమ హాస్యనటుడు:** సత్య, వెన్నెల కిషోర్ (మత్తు వదలరా2)
**ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా** వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
**ఉత్తమ సినిమాటోగ్రాఫర్:** విశ్వనాథ్ రెడ్డి (గామి)
**ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్:** అధ్నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2898 ఏడీ)
**ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్:** నల్ల శ్రీను (రజాకార్)
**ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్:** అర్చనా రావు, అజయ్‌కుమార్ (కల్కి 2898 ఏడీ)
**ఉత్తమ ఎడిటర్:** నవీన్ నూలి (లక్కీ భాస్కర్)
**ఉత్తమ గేయ రచయిత:** చంద్రబోస్ (రాజు యాదవ్)
**ఉత్తమ కథా రచయిత:** శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి)
**ఉత్తమ ఆడియోగ్రాఫర్:** అరవింద్ మేనన్ (గామి)
**ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్:** అరుణ్ దేవ్ (35: చిన్న కథ కాదు), హారిక (మెర్సీ కిల్లింగ్)
ఫీచర్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్ కమ్యూనల్ **హార్మోనీ సోషల్ అప్లిస్ట్:** కమిటీ కుర్రాళ్లు
**ఉత్తమ చారిత్రక చిత్రం :** రజాకార్
**స్పెషల్ జ్యూరీ:** దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్)
**స్పెషల్ జ్యూరీ:** అనన్య నాగళ్ల (పొట్టేల్)
**స్పెషల్ జ్యూరీ:** సుజిత్, సందీప్ (క)
**స్పెషల్ జ్యూరీ:** ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ (రాజు యాదవ్)
**జ్యూరీ స్పెషల్ మెన్షన్:** ఫరియా అబ్దుల్లా (మత్తువదలరా)
**ఉత్తమ తొలి చిత్రం:** యదు వంశీ (కమిటీ కుర్రాళ్లు)

**స్పెషల్ అవార్డ్స్**

**ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు:** నందమూరి బాలకృష్ణ
**పైడి జైరాజ్ అవార్డు:** మణిరత్నం
**బీఎన్‌రెడ్డి ఫిల్మ్ అవార్డు:** సుకుమార్
**నాగిరెడ్డి అండ్ చక్రపాణి ఫిల్మ్ అవార్డు:** అట్లూరి పూర్ణ చంద్రరావు
**కాంతారావు ఫిల్మ్ అవార్డు:** విజయ్ దేవరకొండ
**రఘుపతి వెంకయ్య అవార్డు:** యండమూరి వీరేంద్రనాథ్

ఈ సందర్భంగా జ్యూరీ కమిటీనీ సత్కరించారు. మురళీ మోహన్, జయసుధ తదితరులు పురస్కారాలు అందుకున్నారు. వేదికపై పలువురు ఇచ్చిన ప్రదర్శనలు ఆహూతులను మెప్పించాయి.






EDITORIAL సంపాదకీయం

# విచారణల తర్వాత?

*తెలంగాణ పాలిటిక్స్ లో ఇపుడు విచారణల పర్వం కొనసాగుతోంది. ఈ జూన్ లోనే మాజీ మంత్రులు హరీష్ రావు, ఈటల రాజేందర్ తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు రూపకర్త, మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం జ్యుడిషియల్ కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. కేటీఆర్ సోమవారం ఫార్ములా కేసులో విచారణకు హాజరుకానుండగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావును విదేశాల నుండి రప్పించి విచారిస్తున్నారు. కాళేశ్వరం బిఆర్ఎస్ ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, విపక్ష నేత రాహుల్ గాంధీ సహా బిజెపి, కాంగ్రెస్ జాతీయ ప్రముఖులంతా ఆరోపించారు. ఇపుడు కాళేశ్వరం విచారణలో తర్వాత ఏం జరుగుతుందన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఓ వైపు విచారణల రాజకీయం సాగుతుండగానే, మరోవైపు కాంగ్రెస్ పార్టీ సైలెంట్ గా మంత్రివర్గ విస్తరణ చేసింది. ఎస్సీ, బిసిలకు మాత్రమే చోటు కల్పించి సామాజిక న్యాయానికి కాంగ్రెస్ బ్రాండ్ అని ప్రకటించుకుంది. సినీ అవార్డులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత పదేళ్లలో ముగ్గురు ముఖ్యమంత్రులు చేయలేనిది చేసి చూపించాడు.*

**- తాజా రాజకీయ పరిణామాలపై ఏఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

రాజకీయం ఎపుడైనా ఎన్నికలు ఫలితాల చుట్టే తిరుగుతుంది. అపజయాలను విజయంగా మలుచుకోవడం కంటే రాజనీతి ఉండదు. ఇపుడు జూబ్లిహిల్స్ కు అనుకోకుండా ఉప ఎన్నిక వచ్చింది. ఎన్నిక ఎప్పుడు జరిగినా ఈ గెలుపు రాష్ట్రంలోని మూడు ప్రధాన పక్షాలకూ అత్యవసరం. కానీ జూబ్లీ హిల్స్ నియోజకవర్గ స్వరూపం, గత చరిత్ర, మూడు పార్టీల ప్రస్తుత పరిస్థితిపరంగా చూసినప్పుడు గెలుపు ముగ్గురికీ సవాలే. 2009 నియోజకవర్గాల పునర్విభజనతో ఖైరతాబాద్ నుంచి వేరుపడి ఏర్పడ్డ కొత్త నియోజకవర్గం జూబ్లీహిల్స్. మూడోవంతు ముస్లిం ఓటర్లతో ఉండే అర్బన్ స్థానమిది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుండి పోటీచేసి గెలిచిన గోపీనాథ్ 43.94 శాతం ఓట్లు సాధిస్తే కాంగ్రెస్ అభ్యర్థికి 35.03 శాతం ఓట్లు మాత్రమే దక్కాయి. లోక్‌సభ ఎన్నికల నాటికి కాంగ్రెస్ ఇక్కడ తన ఓటుశాతాన్ని 50.83కు పెంచుకోగలిగింది. అధికంగా ముస్లిం ఓట్లున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో జరిగే ముక్కోణపు పోటీని అధికారపార్టీ తనకు అనుకూలంగా మలచుకునే అవకాశాలు ఉంటాయి. ‘కులగణన’తో పాటు, ‘సామాజిక న్యాయం’ ముస్లిం వర్గంలో రాహుల్ ఇమేజ్ కాంగ్రెస్ కు కలిసొచ్చే అంశాలు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక బిఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే అకాల మృతితో వస్తున్నది. ఈ స్థానాన్ని నిలబెట్టుకోవడం బీఆర్ఎస్‌కు సవాలే. 2023లో ఇక్కడ సాధించిన ఓటు వాటా 43.94 నుంచి 2024 లోక్‌సభ నాటికి అది 10.42 శాతానికి పడిపోయింది. హైదరాబాద్ లో ఏకపక్ష విజయాన్ని సాధించినా.. ఆ వెంటనే వచ్చిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో బిఆర్ఎస్ ఓడిపోయింది. ఇపుడు జూబ్లిహిల్స్ ను కాపాడుకోలేకపోతే.. భవిష్యత్తులో శ్రేణులను కాపాడుకోవడం ఆ పార్టీకి పెద్దసవాల్ గా మారుతుంది. అధికారపార్టీ గెలిస్తే.. గాలి తమవైపే ఉందని స్పష్టం చేయడంతో పాటు సోషల్ గాలి అంతా దురుద్దేశపూర్వకమని రుజువులతో కొట్టిపడేయవచ్చు. మళ్ళీ గెలుపునాటి ఉత్సాహాన్ని కొనసాగించవచ్చు. కంటోన్మెంట్ లో విజయం సాధించినా.. ఆ పవనాలు కాంగ్రెస్ కు పెద్దగా శక్తినివ్వలేదు. కానీ జూబ్లిహిల్స్ లో గెలిస్తే రాజకీయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శక్తిని మరింత పెంచుతుంది. ఈ ఉప ఎన్నిక ఖచ్చితంగా తెలంగాణ రాజకీయాలను ప్రభావితం చేస్తుంది. కాంగ్రెస్ జూబ్లిహిల్స్ లో లోక్ సభ మ్యాజిక్ రిపీట్ చేస్తే.. బిఆర్ఎస్ బిజెపి ఓటింగ్ గంపగుత్తగా కలిసినా.. ఇబ్బంది ఉండదన్న లెక్కలు అధికారవర్గాల్లో సాగుతున్నాయి.

బిఆర్ఎస్ ముఖ్యనేతలందరినీ ఇపుడు నోటీసులిచ్చి.. కమిషన్ల చుట్టూ, ఠాణాల చుట్టూ తిప్పుతున్నారు. కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ ముఖ్యమంత్రి కేసీఆరే హాజరుకాగా, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు కూడా విచారణకు హాజరయ్యారు. కాళేశ్వర నిర్మాణం కర్త కర్మ నేనన్న కేసీఆర్ అది మంత్రివర్గ నిర్ణయమని ఎట్లన్నడన్న ప్రశ్నలువచ్చాయి. నా రక్తం బొట్టుబొట్టు ఖర్చుచేసి కాళేశ్వరం కట్టిన అని అనేక సందర్భాల్లో ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కేసీఆర్ అన్నారు. భారీ కలలు కనడం.. వాటిని సాధించడం కేసీఆర్ కు వెన్నతో పెట్టిన విద్య. అయితే కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు సరిగ్గా అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే కుంగడం కేసీఆర్ పొలిటికల్ కెరీర్ నే కుంగదీసింది. రాజకీయాల్లో పడడం.. లేవడం సహజం. ఇపుడు కేటీఆర్ కు ఫార్ములా ఈకార్ రేస్ అనవసర చెల్లింపుల కేసులో మరోసారి నోటీసులిచ్చారు. మా వర్కింగ్ ప్రెసిడెంట్ కే నోటీసులిస్తారా అంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గర్జించి తమ దెయ్యాల పంచాయతీ టీకప్పులో తుఫానేనని తేల్చేశారు. జైలుకు వెళ్ళేందుకు సిద్దంగా ఉన్నానని, జైలుకెళ్ళి యోగా చేస్తా.. వచ్చాక పాదయాత్ర చేస్తా అని కేటీఆర్ గతంలో మీడియా సమావేశాల్లో ప్రకటించారు. గతంలో ఇదిగో నోటీసు.. అదిగో అరెస్ట్ అంటూ ప్రచారాలు జరిగినా రేవంత్ సర్కార్ వీటిపై తొందరపడడం లేదు. ఇపుడు మరోసారి నోటీసులివ్వడం, ఈ కేసులో ఇప్పటికే ఈడి కూడా ఇన్వాల్వ్ కావడంతో చివరకు ఇది ఏమవుతుందన్న ఉత్కంఠ నెలకొంది.



> రాజకీయం ఎపుడైనా ఎన్నికలు ఫలితాల చుట్టే తిరుగుతుంది. అపజయాలను విజయంగా మలుచుకోవడం కంటే రాజనీతి ఉండదు. ఇపుడు జూబ్లిహిల్స్ కు అనుకోకుండా ఉప ఎన్నిక వచ్చింది. ఎన్నిక ఎప్పుడు జరిగినా ఈ గెలుపు రాష్ట్రంలోని మూడు ప్రధాన పక్షాలకూ అత్యవసరం. కానీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ స్వరూపం, గత చరిత్ర, మూడు పార్టీల ప్రస్తుత పరిస్థితిపరంగా చూసినప్పుడు గెలుపు ముగ్గురికీ సవాలే.

> రాజకీయాల్లో పడడం.. లేవడం సహజం. ఇపుడు కేటీఆర్ కు ఫార్ములా ఈ-కార్ రేస్ అనవసర చెల్లింపుల కేసులో మరోసారి నోటీసులిచ్చారు. మా వర్కింగ్ ప్రెసిడెంట్ కే నోటీసులిస్తారా అంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గర్జించి తమ దెయ్యాల పంచాయతీ టీకప్పులో తుఫానేనని తేల్చేశారు. జైలుకు వెళ్ళేందుకు సిద్దంగా ఉన్నానని, జైలుకెళ్ళి యోగా చేస్తా.. వచ్చాక పాదయాత్ర చేస్తా అని కేటీఆర్ గతంలో మీడియా సమావేశాల్లో ప్రకటించారు. గతంలో ఇదిగో నోటీసు.. అదిగో అరెస్ట్ అంటూ ప్రచారాలు జరిగినా రేవంత్ సర్కార్ వీటిపై తొందరపడడం లేదు.

> దళితులకు నాలుగు మంత్రిపదవులు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రత్యర్థులను కాదు.. సొంతపార్టీనేతలనే ఆశ్చర్యపరిచింది. ప్రస్తుత కేబినెట్ లో ఏకంగా నాలుగు మంత్రిపదవులు, 25 శాతానికి పైగా షేర్ దళితులకు ఇవ్వడం రాహుల్ మార్క్ ను స్పష్టం చేస్తోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దళితులు, బలహీనవర్గాల ఎజెండానే కాంగ్రెస్ పార్టీ అమలుచేస్తున్నదని తెలంగాణ సర్కార్ ద్వారా మరోసారి స్పష్టం చేసింది.

దళితులకు నాలుగు మంత్రిపదవులు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రత్యర్ధులను కాదు.. సొంతపార్టీనేతలనే ఆశ్చర్యపరిచింది. ప్రస్తుత కేబినెట్ లో ఏకంగా నాలుగు మంత్రిపదవులు, 25 శాతానికి పైగా షేర్ దళితులకు ఇవ్వడం రాహుల్ మార్క్ ను స్పష్టం చేస్తోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దళితులు, బలహీనవర్గాల ఎజెండానే కాంగ్రెస్ పార్టీ అమలుచేస్తున్నదని తెలంగాణ సర్కార్ ద్వారా మరోసారి స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా చేస్తూ ముందుకు వెళ్తున్నారు. సన్నబియ్యం పథకం సర్కారు కు మంచిపేరు తెచ్చింది. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం సర్కారు ప్రతిష్ట పెంచుతాయన్న వాతావరణం కనబడుతోంది. గద్దర్ సినిమా అవార్డుల విషయంలో మాటిచ్చి అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే . తెలంగాణ సాంస్కృతిక యుద్దనౌక గా పేరున్న గద్దర్ పేరును సినిమా అవార్డులకు పెట్టడంతో అటు చంద్రబాబు, జగన్, టు కేసీఆర్ చేయలేని పని తాను చేసి చూపించాడు. దిల్ రాజు లాంటి పేరున్న సినీ ప్రముఖుడిని ఎఫ్ డిసి ఛైర్మన్ గా చేయడంతో పాటు సినీ పరిశ్రమను ఒప్పించి గద్దర్ అవార్డుల కల నెరవేర్చడం రేవంత్ కే సాధ్యమైంది. అందుకే ఇపుడు సినీ పరిశ్రమ రేవంత్ పట్టుదలను ప్రశంసిస్తోంది. ఇటీవల జరిగిన ప్రపంచ సుందరి పోటీలు, తాజా గద్దర్ సినీ అవార్డులు చిత్రసీమకు హైదరాబాద్ ను బ్రాండ్ గా నిలపడంలో దోహదపడ్డాయి. తెలుగు సినిమాకు, హైదరాబాద్ సినిమాకు ప్రపంచంలో పెద్ద పేరుండగా.. అవార్డుల వెలితిని తీర్చి పరిశ్రమను ప్రోత్సహించడంలో సీఎం రేవంత్ ముందువరుసలో నిలిచారు. గతంలో చంద్రబాబుకు సినీపరిశ్రమతో ఎంత అనుబంధమున్నా.. రేవంత్ మాత్రం ఈ విషయంలో ఒక అడుగు ముందే ఉన్నాడని పరిశ్రమ నుండి ప్రశంసలు లభిస్తున్నాయి.

తల్లికి వందనం అమలు ద్వారా ఏపీ సీఎం చంద్రబాబు ప్రత్యర్థిపార్టీల విమర్శలకు చెక్ చెప్పడంతో పాటు బాబు మాటిస్తే భరోసానే అని తేల్చిచెప్పారు. తన శైలికి భిన్నంగా భారీ సంక్షేమపథకాన్ని శషభిషలు లేకుండా అమలుచేసి సంక్షేమ సామ్రాట్ గా మారారు. ప్రతీ విద్యార్థికి 13 వేల రూపాయల చొప్పున.. వారి తల్లుల ఖాతాల్లో ఏపీ ప్రభుత్వం డబ్బులు వేసింది. ఇంట్లో ఎంత మంది ఉంటే.. అంతమంది విద్యార్థులకు పథకం అమలుచేసి బాబు ఇలా కూడా చేయగలరా అంటూ ఆశ్చర్యపరిచింది. కూటమి సర్కారు కొలువుదీరి ఏడాదైన సందర్భంగా ‘తల్లికి వందనం’ నిధులను జమ చేశారు. ఎంతమంది పిల్లలు ఉన్నా పథకం వర్తింపజేస్తున్నాం. 67.27లక్షల మంది విద్యార్థులకు రూ.10వేల కోట్లు విడుదల చేశాం. తల్లుల ఖాతాలో రూ.13వేలు, పాఠశాల అభివృద్ధికి రూ.2వేలు కేటాయిస్తున్నాం అని చంద్రబాబు ప్రకటించారు. తల్లికి వందనం పథకం కూటమి ప్రభుత్వంలో గేమ్ ఛేంజర్ కాగా, దీని అమలును ఎప్పటికపుడు మంత్రి నారా లోకేష్ పర్యవేక్షించి అమ్మల కళ్ళల్లో ఆనందం నింపారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ అన్న నినాదం తల్లికి వందనంతో నెరవేరినట్లయింది.

> ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా చేస్తూ ముందుకు వెళ్తున్నారు. సన్నబియ్యం పథకం సర్కారు కు మంచిపేరు తెచ్చింది. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం సర్కారు ప్రతిష్ట పెంచుతాయన్న వాతావరణం కనబడుతోంది. గద్దర్ సినిమా అవార్డుల విషయంలో మాటిచ్చి అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే . సినిమా అవార్డులతో పదేళ్ళలో అటు చంద్రబాబు, జగన్, ఇటు కేసీఆర్ చేయలేని పని తాను చేసి చూపించాడు సీఎం రేవంత్ రెడ్డి.


> కూటమి సర్కారు కొలువుదీరి ఏడాదైన సందర్భంగా ‘తల్లికి వందనం’ నిధులను జమ చేశారు. ఎంతమంది పిల్లలు ఉన్నా పథకం వర్తింపజేస్తున్నాం. 67.27లక్షల మంది విద్యార్థులకు రూ.10వేల కోట్లు విడుదల చేశాం. తల్లుల ఖాతాలో రూ.13వేలు, పాఠశాల అభివృద్ధికి రూ.2వేలు కేటాయిస్తున్నాం అని చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకం కూటమి సర్కారు పనితీరులో గేమ్ ఛేంజర్ లాంటిదే.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

## జీ7 సదస్సుకు హాజరుకానున్న ప్రధాని



**మహా:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాలలో ఐదురోజులపాటు పర్యటించనున్నారని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం అధికారికంగా వెల్లడించింది. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఆ దేశంలో జూన్ 1516 తేదీల్లో పర్యటించనున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తరువాత అక్కడ పర్యటించనున్న మొదటి భారత ప్రధాని మోదీనే. పర్యటనలో భాగంగా సైప్రస్ అధ్యక్షుడితో ఆయన చర్చలు జరపనున్నారు. దీనితోపాటు వ్యాపారవేత్తలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేయనున్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింతగా పెంచుకోవడం, మధ్యధరా ప్రాంతంతో భారత్ సంబంధాల బలోపేతం, యూరోపియన్ యూనియన్‌లతో సంబంధాలను మరింత పటిష్టం చేసే విధంగా ఇరు దేశాల మధ్య ఒప్పందాలు జరగనున్నాయి. అక్కడి నుంచి ప్రధాని మోదీ నేరుగా కెనడాకు వెళ్తారు. ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు జూన్ 1617న కననాస్కిస్‌లో జరగనున్న జీ7 సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొనడం వరుసగా ఆరోసారి. ఇందులో భాగంగా జీ7 దేశాధినేతలతో సమావేశం కానున్నారు. జీ7 దేశాలలోని అంతర్జాతీయ సంస్థల అధిపతులతో ఇంధన భద్రత, కీలక అంతర్జాతీయ సమస్యలు, సాంకేతికత, ఆవిష్కరణలు, ముఖ్యంగా ఏఐతో అనుసంధానం, క్వాంటమ్ సంబంధిత అంశాల గురించి చర్చలు జరపనున్నారు.

## చెరువును తలపిస్తున్న చేవెళ్ల బీజాపూర్ హైవే

**కేజీఆర్ గార్డెన్ వద్ద రోడ్డు కాదు యమపురికి రహదారి**

**స్థానిక ఎమ్మెల్యేకు గుంతల రోడ్డు కనిపించడం లేదా?**

**నిద్రపోతున్న ఆర్ అండ్ బి శాఖ అధికారులు**

**చోద్యం చూస్తున్న రాజకీయ నాయకులు**

**సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే రామస్వామి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి కేజిఆర్ ఫంక్షన్ హాల్ దగ్గర చెరువును తలపిస్తూ ప్రమాదకరంగా, గుంతల మయంగా ఉన్న రోడ్డును, పార్టీ నాయకులతో కలిసి శనివారం వీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంవత్సరాలు గడుస్తున్న చేవెళ్ల పట్టణ కేంద్రంలోనీ కేజీర్ ఫంక్షన్ హాల్ దగ్గర గుంతల మయంగా మారిన రోడ్డు పరిస్థితి మాత్రం చాలా దారుణంగా ఉందని, ప్రతినిత్యము ప్రజలు, రైతులు పండించే కూరగాయలు పూలు హైదరాబాద్ మార్కెట్ కు తరలించేందుకు, ఇదే రహదారి నుండి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. వర్షాకాలం రాకముందే గుంతల మయంగా మారిపోయిందని, రోజు ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోకుండా అధికారులు, రాజకీయ నాయకులు చోద్యం చూస్తు ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నారని మండిపడ్డారు. గతంలో కొంతమంది యువకులు తమ సొంత డబ్బులతో మరమ్మత్తులు చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని, సుమారు కిలో మీటర్ మేర రోడ్డు పరిస్థితి చాలా అద్వానంగా ఉందని వాపోయారు. ప్రతినిత్యము ఈ రోడ్డు పై నుండే స్థానిక ఎమ్మెల్యే ప్రయాణం చేస్తారు. కానీ ఎమ్మెల్యేకు మాత్రం గుంతల మయంగా ప్రమాదకరంగా మారిన రోడ్లు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులు వెంటనే రోడ్డును బాగు చేయించకపోతే 500 మంది కర్షకులతో కార్మికులతో, రైతులతో ప్రజాసంఘాల నాయకులతో, పార్టీ శ్రేణులతో హైదరాబాద్ బీజాపూర్ హైవేను దిగ్బంధం చేస్తామని ఒక మాటతో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏం ప్రభలింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, ఇన్సాబ్, జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, లలిత, పడమటి పెంటయ్య, యాదగిరి పాల్గొన్నారు.

## రక్తదాతలందరూ ప్రాణ దాతలే

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ మహా;** రక్తదాతలందరూ ప్రాణదాతలని, ఇది సామాజిక బాధ్యత అని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవ సందర్భంగా శనివారం వరంగల్ లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హల్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం అనేది అన్ని దానాల కంటే గొప్ప దానం అని అన్నారు. రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చినప్పుడే ఆపద సమయంలో ఉపయోగ పడుతుందని, రక్తం ఏ సమయంలో ఎప్పుడు అవసరం అవుతుందో ఎవరికి తెలియదన్నారు. ప్రమాదాల బారిన పడిన సమయంలో, రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఇలా వివిధ సమయాల్లో రక్తం అవసరమవుతుందని, ఐఎం ఏ, స్వచ్ఛంద సంస్థలు రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఆపదలో ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయని, జిల్లాలో ఉన్న స్వచ్ఛంద సంస్థలు రక్తదానం శిబిరాలు నిర్వహించటం అత్యవసర పరిస్థితిలో రక్తం అవసరం ఉంటే స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తారని ఆన్నారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదానం చేసిన 52 మంది డాక్టర్లు, మెడికల్ రిప్రజెంటేటివ్ లకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబ శివరావు, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ నాగార్జున రెడ్డి, జనరల్ సెక్రెటరీ డాక్టర్ అజిత్ మహమ్మద్, ట్రెజరర్ డాక్టర్ శిరీష్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్, యువ నేతాజీ ఫౌండేషన్ ప్రతినిధులు అరుణ్, రాజు, తదితరులు, పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఆరోగ్య భరోసా సీఎంఆర్ఎఫ్ పథకం

**బాధిత కుటుంబానికి రూ 1లక్ష 20 చెక్కును అందించిన మంత్రి**



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని దేశాయిపేట కు చెందిన కొత్త రాకేశ్ కుమార్తె హన్విత పటేల్ ప్రిమేచుర్ సంబంధిత సమస్యతో పుట్టిన నేపథ్యంలో ఆసుపత్రి ఖర్చులు పెద్ద ఎత్తున కాగా ఈ విషయాన్ని మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకురాగా స్పందించిన మంత్రి సీఎం ఆర్ఎఫ్ పథకం కింద రూ 1 లక్ష 20 వేల చెక్కును పాప తల్లిదండ్రులకు కొండా సురేఖ అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబీకులు శనివారం మంత్రి కొండా సురేఖ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆ చిన్నారిని మంత్రి కొండా సురేఖ మంచి మనస్సుతో దీవించడం జరిగింది. ఈ సందర్భంగా భవిష్యత్ లో ఎటువంటి ఆరోగ్య సమస్య తలెత్తిన తనను సంప్రదించాలని భరోసానిచ్చారు.



## జిల్లాలో రోట వైరస్ వ్యాక్సిన్ ప్రారంభం

**డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు**

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దేశాయిపేటలో రోట వైరస్ వ్యాక్సిన్ ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటి ద్వారా ఇచ్చే రోటా వైరస్ ఒక వ్యాక్సిన్ ఒక్క దఫాల్లో 2 డోసులు ఉంటాయని బిడ్డ పుట్టిన 6 ,10,14 వారాల వయసులో ఈ వ్యాక్సిన్ ను ఇస్తారనీ, తీవ్ర నీళ్ల విరోచనాలు వాంతులు , జ్వరం, కడుపునొప్పి, మూత్ర విసర్జన బరువు తగ్గడం లాంటి వాటిని నిరోధించడం కోసం రోటా వైరస్ వ్యాక్సిన్ చాలా ఉపయోగ పడుతుందని తెలిపారు. జిల్లాలో అర్హత కలిగిన పిల్లలందరికీ ఈ వ్యాక్సిన్ ను ఇచ్చే కార్యక్రమాన్ని శనివారం నుండి ప్రారంభించామని తెలిపారు. గీసుకొండ మండల పరిధిలోని కొమ్మాల, సింగ్య తండా లలో పర్యటించి వ్యాక్సినేషన్ కేంద్రాలను పరిశీలించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది సూచనలతో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ వ్యాక్సిన్ ను తమ పిల్లలకు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రకాష్, పి ఎస్ సి డాక్టర్ భరత్ కుమార్, వైద్యాధికారులు, సీసీ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రకాళి చెరువు పూడిక తీతలో కమిషన్ల మోత

**పూడిక తీత పనుల్లో కోట్ల రూపాయల అవినీతికి తెర.. వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్**



**వరంగల్ మహా;** భద్రకాళి చెరువు పూడికతీత పనుల పై బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తీవ్ర విమర్శలు చేశారు. శనివారం చెరువు పరిసర ప్రాంతాల్లో పార్టీ శ్రేణులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పూడికతీత పేరుతో కోట్ల రూపాయల అవినీతికి తెరలేపిన కాంగ్రెస్ నేతలు జిల్లా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

**పనులలో పారదర్శకత లేదు టెండర్లలో గోల్ మాల్**

భద్రకాళి చెరువు నీటిని నవంబరులో వదిలిన తర్వాత టెండర్లను మార్చి వరకు పిలవలేదని ప్రశ్నించిన ఆయన, అర్హత లేని కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారని, అధికారులు కమిషన్ల ప్రాతిపదికన అక్రమంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కుడా, ఇరిగేషన్ అధికారుల పై బినామీ వ్యాపారం చేస్తున్నట్టుగా ఆరోపించారు. ఇప్పటి వరకు కేవలం 30 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయని తెలిపిన దాస్యం, పనులు పూర్తయ్యే వరకు బిల్లులు చెల్లించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. అధికారులు, కాంట్రాక్టర్లు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల మధ్య కమిషన్ కుదరని ఒప్పందాలే ఆలస్యానికి కారణమని విమర్శించారు.

**ఐ ల్యాండ్ పేరుతో చెరువు విస్తీర్ణం తగ్గింపు**

ఎన్ జీ టీ నిబంధనలకు విరుద్ధంగా చెరువులో ఐ ల్యాండ్లు నిర్మించడం దారుణమని విమర్శించారు. సుందరీకరణ పనులు ప్రారంభించ కుండానే చెరువు విస్తీర్ణాన్ని తక్కువ చేస్తూ ఆర్థికపరమైన గోల్ మాల్ కు తెర లేపారని పేర్కొన్నారు. చెరువు మట్టిని అమ్ముకోవడం పై తీవ్రంగా ఖండించిన ఆయన గచ్చిబౌలిలో భూముల చదును కోసం మాత్రము జేసీబీలు దొరికాయ్..కానీ భద్రకాళి చెరువు పూడిక తీత కు లేవా..? అని ఎద్దేవా చేశారు.

**జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులు**

చెరువు పై ఆధారపడి 800 మత్స్యకార కుటుంబాలు, మొత్తం రెండు వేల మంది ప్రత్యక్షంగా పరోక్షంగా నష్టపోయారని వారికి వెంటనే భృతిని అందించాలని డిమాండ్ చేశారు. పూడికతీత జరిపిన ప్రాంతంలో నీరు నిలవడంతో ఒక బాలుడు మృతి చెందడం బాధాకరమని అభివర్ణిస్తూ బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పూడికతీతకు సంబంధించిన ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని, లెక్కలు తేలే వరకు బిల్లులు ఆపాలని, అవినీతి అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## చేగువేరా స్ఫూర్తితో పోరాటాలు

**సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్**



**ఆదిలాబాద్, మహా:** ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సామ్రాజ్యవాదాన్ని అంతం చేయాలని విప్లవోద్యమంలోకి అడుగుపెట్టి పోరాటాలు చేసిన చేగువేరాను స్ఫూర్తిగా తీసుకుంటూ ముందుకు సాగాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేగువేరా 97 వ జయంతిని శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ మెడిసిన్ చదివి వైద్య వృత్తిని చేపట్టిన తర్వాత సమాజంలోని అసమానతలు, దోపిడీ దౌర్జన్యాలను చూసి చేగువేరా చలించిపోయాడని గుర్తుచేశారు. మనిషిని మనిషి దోచుకునే వ్యవస్థను తుదముట్టించాలన్న లక్ష్యంతో క్యూబా విప్లవ పోరాటానికి నాయకత్వం వహించారని పేర్కొన్నారు. ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలను చూసి ఇప్పటికీ యువత స్ఫూర్తి పొందుతారని అన్నారు. చేగువేరా నమ్మిన సోషలిజం సాధించడంతోనే ప్రజల ఇబ్బందులు దూరమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు మంజుల, బొజ్జ ఆశన్న, సురేందర్, అగ్గిమళ్ళ స్వామి పాల్గొన్నారు.

## కలసి ఉంటే కలదు సుఖం.. రాజీమార్గమే ఉత్తమం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి,న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.హెచ్ రమేష్ బాబు**


**భూపాలపల్లి, మహా :** రాజీ మార్గాన్ని ఎంచుకొని వివాదాలు లేని జీవితాలను గడపాలని జయ శంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.హెచ్. రమేష్ బాబు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ చిన్న చిన్న విషయాల్లో పంతాలకు పోయి గొడవలు పెట్టుకుంటే నష్టమే తప్ప లాభం ఉండదన్నారు. జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని రాజి పడి కేసుల్లో నుండి బయటపడాలని జడ్జి తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ. నాగరాజు మాట్లాడుతూ క్షమా గుణాన్ని కలిగివుండడం గొప్ప విషయం అన్నారు. ప్రతిఒక్కరు సోదరభావంతో మెలగాలని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల , అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. శ్రీనివాస చారి , ప్రధాన కార్యదర్శి వి. శ్రావణ్ రావు , డి.ఎస్.పి. సంపత్ రావు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జి. ప్రియాంక , న్యాయవాదులు ఎం.డి. రఫీక్ , బ్యాంకు ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి నిధులిస్తా ఎమ్మెల్యే

**ఎమ్మెల్యేని కలిసిన ఆరుట్ల ముదిరాజ్ సంఘం**

**భవన నిర్మాణానికి నిధులు ఇస్తానని హామీ**

**కృతజ్ఞతలు తెలిపిన ముదిరాజ్ సంఘం నాయకులు**



**రంగారెడ్డి జిల్లా మహా:** ఆరుట్ల గ్రామంలో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణం నిర్మాణానికి, నిధులు మంజూరు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే రంగారెడ్డి హామీ ఇచ్చారు. మంచాల మండలం, ఆరుట్ల ముదిరాజ్ సంఘ, మత్స్యకారులు ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మాల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాద పూర్వకంగా తొర్రుర్ క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆరుట్ల ముదిరాజ్ మత్స్యకార భవనం అసంపూర్తిగా ఉందని తెలియపర్చగానే సానుకూలంగా స్పందించి భవనాన్ని పూర్తి చేయడం కోసం తన నిధుల నుంచి 10 లక్షల రూపాయల మంజూరు చేస్థానానికి హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడంతో సంఘం నాయకులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల గ్రామ మాజీ సర్పంచ్ కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి మాజీ ఎంపిటిసి కావలి శ్రీను ముదిరాజ్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేష్ , గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల భాషయ్య, కార్యదర్శి దాసరమోని రమేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సికిందర్ రెడ్డి, గ్రామశాఖ కమిటీ ఉపాధ్యక్షుడు తలారి కృష్ణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ మత్స్యశాఖ అధ్యక్షుడు తవిటి యాదగిరి, కార్యదర్శి గుడ్డిమల్ల గిరి ప్రసాద్, ముదిరాజ్ సంఘ పెద్దలు నూకం లక్ష్మయ్య, కావలి యాదయ్య, నాగరాజు పాల్గొన్నరు.



## కెనాల్ కాల్వ మరమ్మత్తు పనులు చేయించిన ఎమ్మెల్యే నాగరాజు

**కృతజ్ఞతలు తెలిపిన గ్రామ రైతులు**

**హన్మకొండ మహా;** హాసన్ పర్తి మండల పరిధిలోని మడిపల్లి గ్రామ నాయకులు రైతులు ధర్మసాగర్ నుంచి వచ్చే ఎర్రి కాల్వ మరమ్మత్తులు చేయించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకు రావడంతో వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి జెసిబి సహాయంతో కెనాల్ కాల్వ మరమ్మతు పనులను చేయించారు. రైతుల ఇబ్బందులను గ్రహించి మడిపల్లి గ్రామ రైతులకు ఎర్రి కాల్వ ద్వారా వచ్చే నీటికి సమస్య లేకుండా మరమ్మతులు చేపిస్తున్నందుకు గ్రామ నాయకులు, రైతులు ఎమ్మెల్యే నాగరాజు కు కృతజ్ఞతలు తెలిపారు.


## చేగువేరా స్ఫూర్తితో పోరాటాలు

**సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్**





**ఆదిలాబాద్, మహా:** ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సామ్రాజ్యవాదాన్ని అంతం చేయాలని విప్లవోద్యమంలోకి అడుగుపెట్టి పోరాటాలు చేసిన చేగువేరాను స్ఫూర్తిగా తీసుకుంటూ ముందుకు సాగాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేగువేరా 97 వ జయంతిని శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ మెడిసిన్ చదివి వైద్య వృత్తిని చేపట్టిన తర్వాత సమాజంలోని అసమానతలు, దోపిడీ దౌర్జన్యాలను చూసి చేగువేరా చలించిపోయాడని గుర్తుచేశారు. మనిషిని మనిషి దోచుకునే వ్యవస్థను తుదమట్టించాలన్న లక్ష్యంతో క్యూబా విప్లవ పోరాటానికి నాయకత్వం వహించారని పేర్కొన్నారు. ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలను చూసి ఇప్పటికీ యువత స్ఫూర్తి పొందుతారని అన్నారు. చేగువేరా నమ్మిన సోషలిజం సాధించడంతోనే ప్రజల ఇబ్బందులు దూరమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు మంజుల, బొజ్జ ఆశన్న, సురేందర్, అగ్గిమళ్ళ స్వామి పాల్గొన్నారు.


## ఎమ్మెల్యేను కలిసిన కొంగరకలాన్ గ్రామస్తులు

- కబ్జాకు గురైన దాతన్ చెరువు దిగువ ప్రాంతం కాలువ
- సర్వే చేయాలని రెవెన్యూ ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు
- కబ్జాకు గురైనట్లయితే అక్రమార్కులపై కఠిన చర్యలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కొంగరకలాన్ రెవెన్యూ పరిధిలోని దాతన్ చెరువు దిగువ ప్రాంతాన్ని, కాలువను సర్వే చేయించాలని ఎమ్మెల్యేను కోరిన కొంగరకలాన్ గ్రామస్తులు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, ఆదిభట్ల మున్సిపాలిటీ, కొంగరకలాన్ రెవెన్యూ పరిధిలోని దాతన్ చెరువు నుండి దిగువ ప్రాంతానికి వెళ్లే కాలువను, చెరువు కట్టను కొందరు అక్రమార్కులు ధ్వంసం చేసి, హద్దురాలను వేయడం జరిగిందని, అలాగే తమ భూమిని కబ్జా చేశారంటూ కొంగరకలాన్ కు చెందిన గ్రామస్తులు, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి, తమ గోడును విన్నపించుకున్నారు. దీంతో స్పందించిన ఆయన వెంటనే సర్వే చేయించాలని, ఇబ్రహీంపట్నం మండలం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూములను, చెరువులను, కాలువలను ఎవరైనా కబ్జా చేయడానికి ప్రయత్నం చేసిన, కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో ఎక్కడైనా చెరువులను, కుంటలను, కాలువలలు ప్రభుత్వ భూములు కబ్జాలకు గురి కాకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై ఉంటుందని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే రంగారెడ్డి తెలిపారు.

## లోక్ అదాలత్ లో 152 కేసుల పరిష్కారం

- ఆమనగల్ ప్రధమ శ్రేణి న్యాయమూర్తి కాటం స్వరూప
- క్షణికావేశంలో పొరపాట్లు చేయకూడదు
- ఒక్క క్షణం ఆలోచిస్తే సమస్య పరిష్కారం
- ప్రజలు ఎవరు కూడా సమస్యల వలయంలో చిక్కుకోవద్దు



**రంగారెడ్డి జిల్లా మహా:** లోక్ అదాలత్ లో తమపై ఉన్న కేసులను పరిష్కరించుకోవాలనీ, ఆసక్తి కనబరిచిన ఆమనగల్ కోర్టు పరిధిలోని ప్రజలు. జూన్ 14వ తేదీన జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆమనగల్ కోర్టులో మొత్తం 152 కేసులు పరిష్కారం అయ్యాయి. దానితో పాటు ప్రభుత్వానికి చలాన్ రూపంలో నగదు అధిక మొత్తంలో వచ్చినట్లు ఆమనగల్ ప్రధమ శ్రేణి న్యాయమూర్తి కాటం స్వరూప తెలిపారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ... ప్రజలు శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవడం జరిగింద తెలిపారు. ప్రజలు చెనికి ఆవేశాలకు క్షణికావేశాలకు లోన్ కాకూడదని ఒక్క నిమిషం ఆలోచన చేస్తే సమస్యలు మన చుట్టూ ధరి చేరవని, క్షణికావేశంలో చేసిన పొరపాట్ల వల్ల సమస్యల వలయంలో చిక్కుకొని, జీవితాన్ని చేతులారా నాశనం చేసుకున్నట్లు అవుతుందని ఆమె ప్రజలకు హితబోధ చేశారు. ఈ సమావేశంలో ఆమనగల్ ఏసిపి బి కార్తీక్, ఆమనగల్ సీఐ వి.జానకిరామ్ రెడ్డి, కడ్తాల్ సీఐ సిహెచ్ గంగాధర్, మాడుగుల సిఐ టి వేణుగోపాల్, ఆమనగల్ ఎక్సైజ్ బధ్యానాయక్, ఎస్సై బి. వెంకటేష్, ఎస్సై ఏ శ్రీకాంత్, కోర్ట్ సిబ్బంది, కోర్ట్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇండ్లు ఇందిరమ్మ ఇండ్లు

- పేదల ఆశయాలకు ప్రాణం పోస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హన్మకొండ మహా :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శనివారం 47వ డివిజన్ పరిధిలోని బాపూజీనగర్, బోడగుట్ట ప్రాంతాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, అధికారికంగా నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని పక్కా ఇంటితో ఓ బీదవాడి జీవితం మారుతుందని ఎమ్మెల్యే నాయిని అన్నారు. చిరకాలంగా ఆశతో ఎదురుచూస్తున్న కల సాకారం కాబోతున్న రోజు ఇది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లోనే ఇంద్రమ్మ రాజ్యం' పునఃరుజ్జీవించిందని ఆయన భావోద్వేగంతో తెలిపారు. అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేస్తామని దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరినీ పరిశీలించి, నిజమైన అర్హులైన వారికి ఇళ్లు అందేలా అధికార యంత్రాంగాన్ని ప్రత్యేకంగా నియమిస్తున్నామని తెలిపారు. నిర్మాణాలలో నాణ్యతకు ఎలాంటి రాజీ లేకుండా పర్యవేక్షణ కొనసాగుతుందనీ, అర్హులకే మొదట ప్రాధాన్యం ఇస్తామన్న విషయాన్ని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు జక్కుల రవీందర్ యాదవ్,సయ్యద్ విజయ శ్రీ రాజాలీ, మాజీ కార్పొరేటర్ రాంబాబు,డివిజన్ అధ్యక్షులు షేక్ అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.

**సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపన**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శనివారం 6 వ డివిజన్ పరిధిలోని లష్కర్ బజార్ మరియు బొక్కలగడ్డ ప్రాంతాల్లో రూ.80 లక్షలతో సీసీ రోడ్డు డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వీటితో ప్రాంత ప్రజలకు నాణ్యమైన రహదారి, మురుగు నీటి పారుదల సౌకర్యాలు కల్పించ బోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి డివిజన్ లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గం చూపు తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌లు , కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక పెద్దలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విస్తరణ ఓకే.. నష్టపరిహారం ఇప్పించండి

## ఎమ్మెల్యే శంకర్ ను కలుసుకున్న మెయిన్ రోడ్ వ్యాపారస్తులు

### నష్టపరిహారం గురించి ప్రభుత్వంతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ

**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరణ కార్యక్రమానికి మున్సిపల్ శాఖ శ్రీకారం చుట్టడంతో వ్యాపారస్తులు అందరూ కలిసి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను ప్రత్యేకంగా కలుసుకున్నారు. రోడ్డు విస్తరణలో తమ దుకాణ సముదాయాలు తొలగించడం వల్ల ఎంతో ఆర్థిక నష్టం జరుగుతుందని కొంతమంది ఒకే షట్టర్ ఉన్నవాళ్లు కూడా ఉన్నారని అలాంటివారు పూర్తిగా నష్టపోతారని ప్రభుత్వం నుండి తమకు నష్టపరిహారం ఇప్పించే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే శంకర్ ను శనివారం పలువురు వ్యాపారస్తులు స్థానిక క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు. వ్యాపారస్తులు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వంతో మాట్లాడి నష్టపరిహారం అదే విధంగా కృషి చేస్తానని తెలిపారు. మెయిన్ రోడ్డు విస్తరణ ఎంతో ముఖ్యమని పెరుగుతున్న జనాభా అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అందరూ సహకరించాల్సిన అవసరం ఉందని ఇది భవిష్యత్తు తరాలకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇప్పటికే మెయిన్



రోడ్డు విస్తరణ లేక ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం ఇతర అసౌకర్యాలు కలుగుతున్నాయని ఈ క్రమంలో అందరూ స్వచ్ఛందంగా సహకరించి విస్తరణకు కృషి చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని ఎమ్మెల్యే వారికి సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పలపట్ల మోహన్ రావు, గజవాడ నరసింహులు, కోట్ర రఘు, రవి, గోపాల్ చారి నాగిళ్ల ప్రభాకర్ నాగిళ్ల ప్రకాష్ గందె సురేష్ కమ్మదనం సుధాకర్ ప్రవీణ్ పల్నాటి శ్రీనివాస్ నర్సింలు షంషీర్, ఎంసాని శ్రీనివాస్, జి శ్రీనివాస్ తదితర వ్యాపారస్తులతో పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ బండ్లగూడ మున్సిపల్ కోర్పోరేషన్ పరిధిలో 7 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను మాజీ మేయర్ మహేందర్ గౌడ్,మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, మాజీ కార్పొరేటర్లు సాగర్ గౌడ్, సురేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ వ్యాప్తంగా అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ ని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో దిక్సూచిగా నిలుపుతామన్నారు. ప్రజల సహాయ సహకారాలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ఈరోజు ప్రారంభిస్తున్నమన్నారు. భవానీ కాలనీలో పార్కును అభివృద్ధి చేస్తాం, కమ్యూనిటీ హాల్ కు అతి త్వరలో మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర నిధులు కేటాయించి కమ్యూనిటీ కాలనీ అతి త్వరలోనే నిర్మాణ పనులు మొదలుపెట్టాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశించారు. బండ్లగూడ కార్పొరేషన్ లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాల పనులు ప్రారంభిస్తామన్నారు. అభివృద్ధితోపాటు సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి అందేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు సూచించారు. ఇందిరమ్మ ఇల్లు, గృహ జ్యోతి, రాజీ యువ వికాసం, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా నాయకులు కృషి చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో నాయకులు ప్రజా



సమస్యలను పరిష్కరించి వారి ఆదరణను పొందిన వారి ప్రజా ప్రతినిధులుగా గెలుపొందుతారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ని భవాని కాలనీ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించారు. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పథంలో నడిపిస్తున్న నాయకులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# తిమ్మాపూర్ లో మామిడి పండ్ల లారీ బోల్తా

## హైవే పై భారీగా ట్రాఫిక్ జామ్.. సంచులు,బుట్టలతో ఎగబడ్డ జనం

**షాద్ నగర్, మహా:** కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ లో మామిడిపండ్ల లారీ బోల్తా పడడంతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్రేన్ సాయంతో లారీని లేపుతున్నారు.లారీ బోల్తా పడిందని తెలియగానే.. సమీపంలోని ప్రజలు పెద్ద సంఖ్యలు ఘటన స్థలానికి చేరుకున్నారు.రోడ్డుపై పడ్డ పండ్ల కోసం ఎగబడ్డారు.చేతికి దొరికినన్ని పండ్లను సంచుల్లో, బుట్టలలో నింపుకొని తీసుకెళ్లారు.లారీ



డ్రైవర్ గాయాలతో ఉన్న కూడా పట్టించుకోకుండా పండ్లను ఎత్తుకెళ్లే పనిలో పడ్డారు జనం..



# పిడుగు పాటు బాధితులకు కలెక్టర్ పరామర్శ

**ఆదిలాబాద్, మహా:** జిల్లాలో ఇటీవల పిడుగు పాటుకు గురై రిమ్స్ లో చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా కలెక్టర్ రాజర్షిషా పరామర్శించారు. వైద్యం అందుతున్న తీరును రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ను అడిగి తెలుసుకున్నారు. శనివారం రిమ్స్ కు వెళ్లిన ఆయన పిడుగుపాటు బాధితులతో మాట్లాడారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమర్జెన్సీ వార్డు లోని మరుగుదొడ్లను పరిశీలించి శుభ్రత పాటించక పోవడం తో అసహనం వ్యక్తం చేశారు. రోగులను పరీక్షించే సమయంలో వైద్యులు ఎవరెవరు ఉన్నారని ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వైద్యులు సమయానికి వస్తున్నారా లేదా అని అక్కడ ఉన్న సిబ్బంది ని అడగగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారి పై చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ను ఆదేశించారు.

# చౌడేశ్వరి మాత ఆలయంలో చోరీ

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ పట్టణ శివారులోని చౌడేశ్వరి మాత ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ ప్రధాన ద్వారం, గేట్లకు వేసిన తాళాలను దొంగలు పగలగొట్టి లోనికి చొరబడ్డారు. బీరువాలోని వస్తువులను చిందరవందర చేశారు. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన సిబ్బంది తాళం పగలగొట్టి ఉండడం, సామాన్లు చిందరవందరగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం తో పరిసరాలను తనిఖీ చేసి ఆధారాలు సేకరించారు.

# సొంతింటి కల.. నెరవేరనున్న వేళ..

## జిల్లాలో ఊపందుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

### అనేక చోట్ల ప్రారంభమైన రెండో విడత నిర్మాణాలు

### ఇసుక అధిక ధరలతోనే లబ్ధిదారులకు ఆర్థిక కష్టాలు

### అధికారులు చొరవ తీసుకుంటే పేదలకు ప్రయోజనం



**ఆదిలాబాద్, మహా:** ఎప్పుడెప్పుడా అని నిరుపేదల సొంతింటి కల త్వరలోనే నెరవేరబోతోంది. గూడులేని పేదలకు సొంతిళ్లు అందుబాటులోకి రానుంది. ఇప్పటికే మొదటి విడతలో మంజూరైన ఇళ్లలో చాలా వరకు నిర్మాణాలు రూఫ్ లెవల్ వరకు చేరుకోగా.. రెండో విడత మంజూరైన వాటిలోనూ చాలా వరకు నిర్మాణాలు ప్రారంభించడం శుభ పరిణామంగా మారింది. బిల్లుల మంజూరులో ప్రభుత్వం, అధికారులు భరోసా ఇవ్వడంతో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు అనేక మంది నిర్మించుకునేందుకు ముందుకొస్తున్నారు. పల్లెల్లో ప్రతి గ్రామంలో ఇంటి నిర్మాణాలు కొనసాగుతుండగా ఇసుక ధరలు అధికంగా ఉండటంతో లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నా..క్షేత్ర స్థాయిలో అధికారులు వీటిపై అవగాహన కల్పించకపోవడం మూలంగా లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది.

### వడివడిగా నిర్మాణాలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీనిచ్చింది. ప్రతి ఏటా నియోజకవర్గానికి 3500చొప్పున విడతల వారీగా మంజూరు చేస్తామని భరోసా ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం తొలి విడతలో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసిన ఇళ్లను మంజూరు చేసిన ప్రభుత్వం ..రెండో విడతలో నియోజకవర్గానికి 3500చొప్పున కేటాయించింది. జిల్లాలో మొదటి విడతలో 2132 ఇళ్లు మంజూరు కాగా 1388మంది ఇంటి నిర్మాణాలను ప్రారంభించారు. ఇందులో 622 ఇళ్లు బేస్మెట్ పూర్తయింది. 61ఇళ్లు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయి. రెండో విడతలో జిల్లాలో 6955 ఇళ్లు మంజూరు కాగా 1486ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఇందులో 23ఇళ్లు బేస్మెట్ పూర్తయింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఇంటి నిర్మాణాలు ప్రారంభం కావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఇన్నాళ్లు ఇళ్లు లేని, రేకుల షెడ్డుల్లో జీవనం సాగిస్తున్న వారి ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తోంది. సర్కారు అండతో సొంతిళ్లు నిర్మించుకుంటున్నామనే ఆనందం కనిపిస్తోంది. ఆదిలాబాద్ పట్టణంలోనూ రెండు రోజుల క్రితం లబ్ధిదారులకు మంజూరుపత్రాలు అందించారు. ఇక్కడ కూడా త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

### ఇసుక ధరలతోనే ఇబ్బందులు

జిల్లాలో అనేక చోట్ల ఇంటి నిర్మాణాలు ప్రారంభం కావడంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. ఇది వరకు నదులు, వాగుల నుంచి అక్రమంగా ఇసుక తీసుకెళ్లుండగా.. ప్రభుత్వం, అధికారుల చర్యల కారణంగా పూర్తిగా నివారించారు. దీంతో ఆయా నదుల నుంచి అధికారికంగానే ఇసుక తీసుకు రావాల్సి వస్తోంది. కొందరు మాత్రం ఇంటి నిర్మాణాల పేరుతో అక్రమంగానూ తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఒక్కో ట్రాక్టర్ ఇసుకకు రూ. 4వేల నుంచి రూ.7వేల వరకు తీసుకుంటున్నారు. ఇసుక నాణ్యత, అధిక లోడ్ ప్రకారం ఈ ధరలను నిర్ణయిస్తున్నారు. కానీ పేదలకు ఇది చాలా భారంగా మారుతోంది. ఇది వరకు కేవలం ఒక్కో ట్రాక్టర్ కేవలం రూ.3వేల వరకు వస్తుండగా.. ప్రస్తుతం ఈ ధర అమాంతం పెరగడం ఇబ్బందికరంగా మారింది. అధికారులు మాత్రం ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆయా నదులు, వాగుల నుంచి అనుమతి తీసుకొని ఉచితంగా తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. కానీ అనుమతులు తీసుకోవడం పేదలకు చాలా ఇబ్బందికరంగా మారింది. అనుమతుల ప్రక్రియ సులభతరం చేస్తే అనేక మంది ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి



జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. తొలి విడత మంజూరైన వాటిలో కొన్ని పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. రెండో విడతలోనూ అన్ని గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో వీటిని మరింత వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. బిల్లుల మంజూరులోనూ ఎలాంటి ఇబ్బందుల ఉండవు. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణాలు ఆయా దశలకు చేరుకోగానే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయి.

- షాకీర్, హౌసింగ్ డీఈ, ఆదిలాబాద్

# కార్మిక సంక్షేమ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయి

## ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు

**రాజేంద్రనగర్, మహా :** భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశం ఓబీసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు అన్నే ప్రభువు ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం శంషాబాద్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు హాజరయ్యారు. సమావేశంలో మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయి. భవన నిర్మాణ కార్మికులను కార్మిక శాఖకు సంబంధం లేకుండా ఇన్సూరెన్స్ కంపెనీలకు ధారాతత్వం చేస్తున్నాయి. ప్రభుత్వాలు కార్మికుల కోసం ప్రత్యేకంగా నిధులు ఏర్పాటు చేయకుండా ప్రభుత్వాలు కార్మికులను ఆపదలో ఆదుకునే పరిస్థితి లేకుండా ఇన్సూరెన్స్ కంపెనీలతో కార్మికుల బతుకులను ముడి వేస్తున్నారని ఎదవ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు త్రీవ అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. ఏఐటీయూసీ పోరాటాలతోనే ప్రమాద బీమా ని ఆరు లక్షల నుంచి 8 లక్షలకు పెంచాము. భవిష్యత్తులో కార్మిక శాఖకు సంబంధం లేకుండా కార్మికులను వదిలేస్తున్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పక్కదారి పట్టిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా కార్మి



కుల సంక్షేమ నిధులను కార్మికులకు అందకుండా ఇన్సూరెన్స్ కంపెనీలతో కార్మికులకు బతుకులను ముడి వేస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులకు యూనియన్లు లేకుండా ప్రభుత్వాలు చేస్తున్నాయి. రాబోయే తరాల్లో కార్మికులను రోడ్డున పడేసే పరిస్థితి ప్రభుత్వాలు కల్పిస్తున్నాయన్నారు. భవన నిర్మాణానికి సంక్షేమ బోర్డును కాపాడుకునేందుకే రంగారెడ్డి జిల్లా జూన్ 17న హైదరాబాదులో కార్మిక శాఖ కార్యాలయంలో జరిగే మహాధర్నకు భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓ బి సి రాష్ట్ర కార్యదర్శి మల్లేష్, స్టేట్ కౌన్సిల్ సభ్యులు బాబురావు, నర్రగిరి, ప్రభు, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాల్ రెడ్డి, మాధవ్, శ్రీను, సురేష్ నాయక్ కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

**రాజేంద్రనగర్ మహా ;** శంషాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్న విజయ్ కుమార్ (24) 5న ఆక్సిడెంట్ గురై మరణించారు.మరణించిన పోలీస్ కానిస్టేబుల్ విజయ్ కుమార్ కి శంషాబాద్ జోన్ పోలీస్ సిబ్బంది డి సి పి రాజేష్ కుమార్ 15 లక్షల రూపాయలను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శంషాబాద్ రూరల్ సీఐ నరేందర్ రెడ్డి, ఆర్.జి.ఐ ఇన్స్పెక్టర్ బాలరాజు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలతో ప్రజల ముందుకు వెళ్తాం

## టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా ;** టి పి సి సి ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో ఆయనను శనివారం కలిసి పిసిసి కార్యవర్గంలో తనకు స్థానం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలతో ప్రజల ముందుకు వెళ్తామన్నారు. పది సంవత్సరాలుగా నిరుపేదలు ఎదురు చూస్తున్న ఇందిరమ్మ ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని భవిష్యత్తులో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్ళను నిర్మిస్తుంది అన్నారు. ఉచిత బస్సు మహిళలు ప్రయాణం కొనసాగిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి



కి గృహ జ్యోతి అందిస్తున్నాము. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగిస్తుందన్నారు.

# మరో వివాదంలో సినీ నటి కల్పిక

## కేసు నమోదు

**మహా:** హైదరాబాద్లోని ప్రిజం క్లబ్ వ్యవహారంలో సినీ నటి కల్పికపై ఇటీవల కేసు నమోదు కగా, ఇపుడు కల్పికపై మరో కేసు కూడా నమోదు అయింది. ఇన్స్టా వేదికగా అసభ్య పదజాలంతో కల్పిక తనని దూషించిందని పేర్కొంటూ కీర్తన అనే బాధితురాలు తాజాగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఆన్లైన్ వేదికగా నటి వేధింపులకు పాల్పడుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన టువంటి ఆధారాలను పోలీసులకు అందించారు. బాధితురాలి కంప్లైంట్ మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నటి కల్పికపై ఇప్పటికే గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఇటీవల ప్రిజం క్లబ్‌కు వెళ్లినప్పుడు ఆమె హంగామా సృష్టించిందని, క్లబ్ మేనేజర్ ఇతర సిబ్బందిపై అత్యాచారం, అసభ్య ప్రవర్తన ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేసిందని క్లబ్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల ఎదుట కూడా కల్పిక అసత్యమైన ఆరోపణలు చేసిందని క్లబ్ ఆస్తిని ధ్వంసం చేసిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# నీట్ ఫలితాలు విడుదల

**మహా:** లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న నీట్ (యూజీ) ఫలితాలు విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ ఫలితాలను ఎన్టీఏ అధికారులు శనివారం) విడుదల చేశారు.

**ఆలిండియా ఫస్ట్ ర్యాంక్..**

రాజస్థాన్‌కు చెందిన మహేశ్‌కుమార్‌కు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఉత్కర్ష్‌కు ఆలిండియా రెండో ర్యాంక్, మహారాష్ట్రకు చెందిన కృషంగ్ జోషికి అలిండియా మూడో ర్యాంక్‌తో ఉత్తీర్ణత సాధించారు.

**సత్తా చాటిన తెలుగు విద్యార్థులు..**

ఈ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 36,776 మంది, తెలంగాణ నుంచి 41,584 మంది నీట్‌లో అర్హత సాధించారు. ఏపీ నుంచి కార్తీక్‌రామ్‌కు 19వ ర్యాంక్, కొడవటి మోహిత్ శ్రీరామ్ 56వ ర్యాంక్, దేశిన సూర్యచరణ్‌కు 59వ ర్యాంకు, పొదిలపు అవినాష్‌కు 64వ ర్యాంకు, యర్రా సమీర్‌కుమార్‌కు 70వ ర్యాంకు, తుమ్మూరి శివ మణిదీప్‌కు 92వ ర్యాంకు దక్కించుకున్నారు. నీట్‌లో ఆలిండియా లెవల్‌లో 19 ర్యాంకు, రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన కార్తీక్ రామ్ కిరీటిది రాజమహేంద్రవరం. రాజమహేంద్రవరంలో 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు కార్తీక్‌రామ్ చదువుకున్నాడు. ఇతని తండ్రి అంజనీ కుమార్ స్థానిక ఈఎన్‌టీ వైద్యుడు. తల్లి గృహిణి. ఆలిండియా లెవల్‌లో 19 ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందని కార్తీక్ చెప్పాడు. అలాగే తిరుమల విద్యాసంస్థల్లో చదువుకున్న కశ్యప్ 198 ర్యాంకు, సాయి పవన్ 587 ర్యాంకు, సాహితి 1208వ ర్యాంకు, సంతోష్ 1518వ ర్యాంకు సాధించినట్లు తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ తిరుమలరావు తెలిపారు. ఈ ఏడాది 310 పైగా ఎంబీబీఎస్ సీట్లు తమ విద్యాసంస్థల్లో చదువుకున్న విద్యార్థులు దక్కించుకోనున్నట్టు తిరుమలరావు చెప్పారు. తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు నీట్‌లో ర్యాంకులు సాధించడంతో బాణాసంచా కాల్చి, తీన్మార్ నృత్యాలతో సంబరాలు చేసుకున్నారు. తెలంగాణ నుంచి కాకర్ల జీవన్ సాయికుమార్ 18వ ర్యాంక్, షణ్ముఖ నిషాంత్ 37వ ర్యాంక్, మంగరి వరుణ్ 46వ ర్యాంక్, యంద్రపాటి షణ్ముఖ్ 48వ ర్యాంక్, విదిష మార్ఖికి 95వ ర్యాంకు సాధించారు.

# తప్పుడు ప్రచారాలపై వెల్దండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

## సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు సిఐ విష్ణువర్ధన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా మహా:** సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఈనెల 12వ తారీఖున పోతేపల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరగగా ఆ విషయమై బాధితుడు వెల్దండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ తెలిపారు. ఈనెల 12వ తారీఖు గురువారం రోజున పోతేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గొడవ పడడంతో బాధితుడు వెల్దండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. వెల్దండ మండలం పోతేపల్లి గ్రామంలో జరిగిన గొడవకు సంబంధించిన, ఒక వీడియోను కొంతమంది వ్యక్తులు ఇందిరమ్మ ఇండ్ల కోసం కొట్టుకుంటున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అంటూ, వాట్సప్ గ్రూపులలో తప్పుడు ప్రచారం చేయడం జరిగిందన్నారు. ఇట్టి విషయమై తప్పుడు ప్రచారాలు చేస్తున్న వ్యక్తుల పైన వెల్దండ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఇకనుంచి ఎవరైనా ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు వార్తలను ప్రచారం చేసినా లేదా వాట్సాప్ గ్రూప్ లలో ఫార్వర్డ్ చేసిన వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# కాంగ్రెస్ అంటేనే కుంభకోణం..

## బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ధ్వజం

**షాద్ నగర్, మహా:** మాట్లాడితే తాను నల్లమల బిడ్డను అంటూ ప్రచారం చేసుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలో భారతీయ జనతా పార్టీ కేంద్రంలో 11 సంవత్సరాల మోడీ పాలనపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ఇక్కడ ఎంపీగా గెలిచి తాను పాలమూరు బిడ్డనని ప్రచారం చేసుకొని ప్రాజెక్టును ఒక్క అడుగు కూడా ముందుకు తీసుకోకుండా వెళ్లిపోయారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా ఆయననే అనుసరిస్తున్నారని ఆరోపించారు. ఇద్దరు కుర్చీ వేసుకుని లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ పూర్తి చేస్తామన్నారని, అప్పుడు కెసిఆర్ కు గాని, ఇప్పుడు రేవంత్ రెడ్డికి



గాని కుర్చీలు దొరకడం లేదని ఎద్దేవా చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వం ఫోన్ టాపింగ్ చేస్తుందని తాను ఆనాడే చెప్పినా ఎవరు పట్టించుకోలేదని, ఇప్పుడు కూడా కేవలం కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఐదేళ్లలో ఒక వంతు పాలన అయిపోయిందని ఇంకా ఎంతకాలం దీనిని సాగదీస్తారని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ ఏం చేసింది అని ప్రశ్నించే కాంగ్రెస్ మధ్యతరగతి వర్గాలకు 12 లక్షల పన్ను పరిమితిని విధించిన సంగతి గుర్తుంచుకోవాలన్నారు. అదేవిధంగా దళిత వర్గాల కోసం గత బడ్జెట్లో 1.5 లక్షల కోట్లు కేటాయించిందన్నారు. కులాల గణన చేయాలంటూ పట్టుబడుతున్న రాహుల్ గాంధీ ఒక్కసారి బిజెపి అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యేలను, ఎంపీలను చూడాలన్నారు. ఇందులో 80 శాతం ఎస్సీ ఎస్టీ వర్గాలు, మహిళలు ఉన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అంటేనే కుంభకోణాల పార్టీ అని, బిజెపి పారదర్శకంగా పనిచేస్తుందని అన్నారు. 11 సంవత్సరాల పాలనలో ప్రధాన మంత్రి మోడీ ఎన్నెన్నో సంక్షేమ కార్యక్రమాలను పేద ప్రజల కోసం తీసుకువచ్చారని పేర్కొన్నారు. యువత, నిరుద్యోగులు, కార్మికులు, మహిళలు.. ఇలా అన్ని వర్గాలకు తమ ప్రభుత్వ హయాంలో ప్రయోజనాలు చేకూరాలని స్పష్టం చేశారు. మరోవైపు ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశ అవతరించిందని అన్నారు.



## పిజ్జా కంపెనీలో రూ. 1801 కోట్ల షేర్లు అమ్మేసిన ప్రమోటర్లు

జూబిలెంట్ గ్రూప్ కంపెనీల్లో ప్రమోటర్లు గణనీయంగా వాటాలు విక్రయించారు. జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ (జేఎఫ్ఎల్), జూబిలెంట్ ఇన్‌గ్రేవియా, జూబిలెంట్ ఫార్మోవాలో రూ. 1,801 కోట్ల విలువ చేసే వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా అమ్మేశారు. ఎన్ఎస్ఈలోని బ్లాక్ డీల్స్ డేటా ప్రకారం జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ ప్రమోటర్ అయిన జూబిలెంట్ కన్జూమర్ 1.06 కోట్ల ఈక్విటీ షేర్లను (1.61 శాతం వాటా) విక్రయించింది. అలాగే, జూబిలెంట్ ఇన్‌గ్రేవియా ప్రమోటింగ్ సంస్థలు (జూబిలెంట్ ఎన్‌ప్రో, నికిత రిసోర్సెస్, శ్యామ్ సుందర్ భార్తియా ఫ్యామిలీ ట్రస్ట్) 98.65 లక్షల షేర్లు (6.2 శాతం వాటా) విక్రయించాయి. అలాగే జూబిలెంట్ ఫార్మోవా ప్రమోటర్ సంస్థలు జూబిలెంట్ ఎన్‌ప్రో, నికిత రిసోర్సెస్ 32.86 లక్షల షేర్లను (2.06 శాతం వాటా) విక్రయించాయి. ఈ షేర్లను సగటున రూ. 662-1,060.37 రేటుకు అమ్మడంతో మొత్తం అన్ని లావాదేవీల విలువ కలిపి రూ. 1,800.98 కోట్లుగా నమోదైంది.

## కార్లు కొంటలేరు.. డీలర్ల వద్ద పేరుకుపోయిన రూ.52 వేల కోట్ల ఇన్వెంటరీస్!



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఆటోమొబైల్ షోరూంలు వెలవెలబోతున్నాయి. వ్యాపారాన్ని భారీగా విస్తరించాలనే ఉద్దేశంతో గల్లికోక షోరూంలను నెలకొల్పిన ఆటోమొబైల్ సంస్థలు ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఒకవైపు నిర్వహణ ఖర్చులు అధికమవగా..మరోవైపు అమ్మకాలు పడిపోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి సంస్థలు. దేశవ్యాప్తంగా ఉన్న కారు డీలర్ల వద్ద రూ.5152 వేల కోట్ల విలువైన కార్ల ఇన్వెంటరీ పేరుకుపోయింది. రిటైల్‌గా డిమాండ్ పడిపోవడం, మరోవైపు ధరలు ఇబ్బడిముబ్బడిగా పెంచేయడంతో కొనేవారు కరువయ్యారు. రోజుకొక కొత్త మాడల్‌ను మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఆటోమొబైల్ దిగ్గజాలు..పాతవాటిని పట్టించుకోవడం లేదు. దీనికోసం డీలర్ల ఎగబడి బుకింగ్ చేసుకొని కొనుగోలుదారులు ఆకట్టుకోవాలని అన్ని విధాలుగా ప్రయత్నిస్తుంటే వారికి మాత్రం నిరాశే ఎదురవుతున్నది. అమ్మకాలను పెంచుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు ఇబ్బడిముబ్బడిగా ఉత్పత్తి చేసి మార్కెట్లోకి విడుదల చేయడం కూడా నిల్వలు పెరగడానికి ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. సంఖ్యపరంగా చూస్తే స్వల్పంగా తగ్గినప్పటికీ విలువ పరంగా చూస్తే మాత్రం రికార్డు స్థాయికి చేరుకున్నది. దీంతో డీలర్ల ఆందోళన ఆకాశానికి చేరుకున్నది. గతేడాది దీపావళి సమయంలో ఇన్వెంటరీ స్టాక్ 40 నుంచి 45 రోజులు ఉండగా, గత నెలలో ఇది 3438 రోజులకు తగ్గినప్పటికీ విలువ పరంగా చూస్తే మాత్రం భారీగా పెరిగింది.

**ధరల పెరుగుదలే కారణం**

ఆటోమొబైల్ సంస్థలు ఇబ్బడిముబ్బడిగా ధరలు పెంచడంతో కొనుగోళ్లు చేయడానికి కస్టమర్లు జంకుతున్నారు. గడిచిన ఏడాదికాలంలో వాహన ధరలు సుమారుగా 10 శాతం వరకు అధికమయ్యాయి. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు డాలర్‌రుపీ ఎక్స్ఛేంజ్ రేట్ల కారణంగా చూపించి ధరలు పెంచాల్సి వస్తున్నదని సంస్థలు చెబుతున్నాయి. కానీ, ఈ నిర్ణయంతో సామాన్యుడిని కారును దూరం చేస్తున్నాయి. ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ సమాఖ్య(ఫాడా) ఇన్వెంటరీ స్థాయి గరిష్ఠ స్థాయికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తున్నదని, ప్రస్తుతం ఇది 5253 రోజుల స్థాయిలో ఉన్నదని, దీంతో డీలర్ల నిర్వహణ ఖర్చులు అధికమై తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొంది.

**రిటైల్ అమ్మకాల దెబ్బ**

దేశవ్యాప్తంగా రిటైల్ వాహన అమ్మకాలు అంతకంతకు పడిపోతున్నాయి. గతేడాదితో పోలిస్తే స్వల్పంగా పెరిగినప్పటికీ, గడిచిన ఎనిమిది నెలల్లో ఇదే కనిష్ఠ స్థాయి కావడం విశేషం. హోల్‌సేల్ అమ్మకాలతో పోలిస్తే రిటైల్ సేల్స్ తగ్గాయని ఫాడా వెల్లడించింది. గత నెలలో 3,02,214 కార్లు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన దాంతో పోలిస్తే 3.14 శాతం తగ్గాయి. పెరుకుపోతున్న కార్ల నిల్వలపై డీలర్లు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కానీ, మారుతి, హ్యుందాయ్ ఉన్నతాధికారులు మాత్రం ఇన్వెంటరీలు ఆరోగ్యకరమైన స్థాయిలో ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. మారుతి ఇన్వెంటరీ 35 రోజుల స్థాయిలో ఉన్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

**కొన్ని మాడళ్లకు డిమాండ్**

కొన్ని మాడళ్లను కొనుగోలు చేసేవారు కరువయ్యారు. కానీ, మరికొన్ని మాడళ్లకు మాత్రం డిమాండ్ అధికంగా ఉన్నది. వీటికోసం రెండు నుంచి మూడు నెలల వరకు వేచివుండే కస్టమర్లు ఉన్నారు. మారుతికి చెందిన ఎస్‌యూవీ బ్రెజ్జా, ఎర్టిగా, మహీంద్రా థార్, థార్ రోక్స్, స్కార్పియోఎన్ కోసం వేచిచూస్తున్నారు. మరోవైపు, ఇటీవలకాలంలో బ్యాంకులు కీలక వడ్డీరేట్లను తగ్గిస్తుండటం, ఆదాయ పన్ను ప్రయోజనాలతో భవిష్యత్తులో వాహనాలకు డిమాండ్ అధికంగా ఉంటుందని పలువురు ఆటోమొబై దిగ్గజ నిపుణులు అంచనావేస్తున్నారు.

తక్కువ ఆదాయం కలిగిన వారికి కేంద్రం శుభవార్తను అందించడం, వరుసగా బ్యాంకులు వాహన రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తుండటంతో ఈ ఏడాది రెండో అర్థభాగం నాటికి డిమాండ్ అధికంగా ఉండే అవకాశాలున్నాయి. - కపిల్ సింగ్, నోమురా గ్లోబల్ మార్కెట్ రీసర్చ్ హెడ్



## లక్ష దాటిన పుత్తడి


### ఒక్కరోజే రూ.2,200 ఎగిసిన తులం విలువ

**న్యూఢిల్లీ :** బంగారం మళ్లీ దూసుకుపోయింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్ మిలటరీ దాడుల నేపథ్యంలో అంతర్జాతీయ దేశాల్లో ఒకేసారి అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అతి విలువైన లోహాల ధరలతోపాటు క్రూడాయిల్ ధరలు భగ్గుమన్నాయి. గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన పుత్తడి ధర తిరిగి లక్ష రూపాయలు అధిగమించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల ధర రూ.2,200 ఎగబాకి రూ.1,01,540గా నమోదైంది. దీంతోపాటు 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల పుత్తడి ధర రూ.1,900 ఎగబాకి రూ.1,00,700 పలికింది. గతంలో ఏప్రిల్ 22న బంగారం ధర రూ.1,800 ఎగబాకి చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,01,600 పలికింది. బంగారంతోపాటు వెండి కూడా పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడం వెండి రికార్డు స్థాయిలో దూసుకుపోయింది. కిలో వెండి రూ.1,100 ఎగబాకి రూ.1,08,100 పలికింది. ఈ నెల 9న కూడా వెండి ధర రూ.1,000 అధికమై చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,08,100కి చేరుకున్న విషయం తెలిసిందే. మరోవైపు, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఆగస్టు నెల డెలివరీ కాంట్రాక్ట్‌గాను రూ.2,011 ఎగబాకి రూ.1,00,403గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 28.30 డాలర్లు ఎగబాకి 3,415.13 డాలర్లు పలికింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో మదుపరులు తమ పెట్టుబడులను పుత్తడి వైపు మళ్లించడం ధర పెరగడానికి కారణమన్నారు.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL






## రక్షణ కవచాన్ని చీల్చుకుని మరీ..

ఇరాన్ అణు ముప్పును తప్పించేందుకు ఆపరేషన్ రైజింగ్ లయన్ చేపట్టినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు శుక్రవారం ప్రకటించారు. ఈ క్రమంలో ఇరాన్‌పై 24 గంటల వ్యవధిలోనే రెండు సార్లు వైమానిక దాడులకు పాల్పడింది ఇజ్రాయెల్ సైన్యం(IDF). ప్రతిగా ఇరాన్ కూడా దాడులు జరిపింది. డ్రోన్లతో జరిపిన దాడులను ఐడీఎఫ్ తిప్పికొట్టగలిగింది కానీ.. క్షిపణుల దాడిలో మాత్రం దెబ్బ తింది. ఏకంగా రాజధాని టెల్ అవీవ్‌లో.. అదీ రక్షణ ప్రధాన కార్యాలయంపై దాడి జరగ్గా.. ఏ రక్షణ వ్యవస్థ అడ్డుకోలేకపోయింది. ఆకాశంలో క్షిపణులు దూసుకొస్తున్నా ఇజ్రాయెల్ ప్రజలు ఏమాత్రం వణికిపోకుండా తమ పని తాము చేసుకుంటారు. ఎందుకంటే ఐరన్ డోమ్ ఉందనే ధైర్యం. కానీ, శనివారం భీకర యుద్ధంలో ఇరాన్ వందలాది బాలిస్టిక్ క్షిపణులను ఇజ్రాయెల్ పైకి ప్రయోగించింది. ఈ క్రమంలో రక్షణ వ్యవస్థ ఐరన్ డోమ్‌ను చీల్చుకుంటూ మరి మిస్సైల్స్ దూసుకెళ్లాయి. పెద్ద శబ్దంతో.. దూసుకొచ్చిన మిస్సైల్ సెకన్ల వ్యవధిలోనే భవనాన్ని తాకింది. ది టైమ్స్ ఈ 19 సెకన్ల వీడియోను ధృవీకరించింది. బ్యాక్‌గ్రౌండ్‌లో టెల్ అవీవ్‌కు తలమానికంగా భావించే కీర్యా ప్రాంతంను చూడొచ్చు. ఇరాన్ మిస్సైల్స్‌ను ఐరన్ డోమ్ అడ్డుకుంటుందని భావించినప్పటికీ అది జరగలేదు. మిస్సైల్ నేరుగా రక్షణ కార్యాలయాన్ని ఢీ కొట్టింది. అయితే అక్కడ జరిగిన నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థను వినియోగిస్తోంది. ఇతర భూభాగాల నుంచి రాకెట్లను ఇజ్రాయెల్‌పై ప్రయోగిస్తే రాడార్ వ్యవస్థ దాన్ని అధ్యయనం చేస్తుంది. అనంతరం క్షిపణులు వెళ్లి ఆ రాకెట్‌ను అడ్డుకుంటాయి. అయితే శనివారం నాడు నిమిషాల వ్యవధిలోనే వేలాది రాకెట్లను ఇరాన్ ప్రయోగించింది. కానీ, వాటిని అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ పవిఫలమైంది.

**ఐరన్ డోమ్ ఉండేది అక్కడే..**

ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఒకే దశలో ఉండదు. ఇందులో మూడు దశలు ఉంటాయి. యారో2, యారో3 సిస్టమ్స్‌ను బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకోవడానికి వినియోగిస్తారు. ఇవి ఆకాశంలోనే బాలిస్టిక్ క్షిపణులను పేల్చేసి.. వాటి శకలాల నుంచి ముప్పును దూరం చేస్తాయి. ఆపై డేవిడ్ స్లింగ్ మధ్యశ్రేణి రక్షణ వ్యవస్థగా పనిచేస్తుంది. 100200 కిలోమీటర్ల స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ఎదుర్కోవడానికి వాడతారు. అంతేకాదు.. యుద్ధ విమానాలు, డ్రోన్లను కూల్చేయడంలోనూ దీనిదే కీలక పాత్ర. ఇక.. చిట్టచివరి దశలో ఐరన్ డోమ్ ఉంటుంది. దీనిని ఇజ్రాయెల్ విస్తృతంగా వాడుతుంది. హమాస్, హెజ్‌బొల్లా ప్రయోగించిన వేల రాకెట్లు, వందల డ్రోన్లను కూల్చేసింది. ఇజ్రాయెల్‌కు అసలైన రక్షణ కవచంగా నిలిచింది. దూసుకొచ్చే ఒక్కో ముప్పును పేల్చేయడానికి రెండు క్షిపణులను ఐరన్ డోమ్ ప్రయోగిస్తుంది. ఒక్కో క్షిపణిని అడ్డుకోవడానికి సుమారు 50 వేల డాలర్లు ఖర్చవుతుందని అంచనా.

**పని చేసేది ఎలాగంటే..**

ఐరన్ డోమ్‌ను స్థానికంగా కిప్పాట్ బర్జెల్‌గా వ్యవహరిస్తారు. ఇది స్వల్పశ్రేణి ఆయుధాలను అడ్డుకొంటుంది. దీనిలో రాడార్, కంట్రోల్ సెంటర్, మిసైల్ బ్యాటరీ ఉంటాయి. రాడార్ తొలుత దూసుకొస్తున్న ముప్పును పసిగడుతుంది. అది ఎక్కడ నేలను తాకుతుందో అంచనావేస్తుంది. అక్కడ ఎటువంటి నిర్మాణాలు లేకపోతే.. వదిలేస్తుంది. అదే జనావాసాలు అయితే మాత్రం. రాకెట్‌ను ప్రయోగించి దానిని ధ్వంసం చేస్తుంది. ఈ వ్యవస్థ తయారీలో ఇజ్రాయెల్‌కు చెందిన ఎల్టా, ఎంప్రెస్ట్ సిస్టమ్, రఫెల్ సంస్థలు పనిచేశాయి.

### సక్సెస్ రేటుపై అనుమానాలా?

2006లో హెజ్‌బొల్లా-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. నాడు వేల రాకెట్లను ఆ సంస్థ టెల్ అవీవ్ పై ప్రయోగించింది. దీంతో భారీగా ప్రాణనష్టం చోటు చేసుకొంది. దీంతో ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌కు తయారీకి నిర్ణయించింది. దీనికి అమెరికా పూర్తిగా సాయం చేసింది. 2008 నాటికి టమిర్ క్షిపణులను పరీక్షించింది. 2009లో ప్రాథమిక ప్రయోగాలు పూర్తి చేసింది. 2011 నాటికి అందుబాటులోకి తెచ్చింది. ఐరన్ డోమ్ సక్సెస్ రేటు 90శాతానికి పైగానే ఉంది. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్లో ఇదో అద్భుతం. అయితే 2023 అక్టోబర్ 7 నాటి హమాస్ దాడులను, తాజా ఇరాన్ క్షిపణి దాడులను అడ్డుకోవడంలో ఈ ఐరన్ డోమ్ వ్యవస్థ తడబడింది.

## ఆ అరెస్టులపై డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గినట్లా..!




అక్రమ వలసదారుల అరెస్టులకు వ్యతిరేకంగా అమెరికా లోని లాస్ ఏంజిల్స్ లో పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. దాంతో ఆ అరెస్టులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. వలసదారులు ఎక్కువగా పనిచేస్తున్న ఆ ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా త్వరలోనే ఓ ఉత్తర్వు జారీ చేస్తానని ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా లాస్ ఏంజిల్స్‌లోని వ్యవసాయ పరిశ్రమలు, హోటళ్లు, రెస్టారెంట్ లలో సోదాలు నిలిపివేయాలని ఆయన ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు మీడియాల్లో కథనాలు వెలువడుతున్నాయి. ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లోని ఓ సీనియర్ అధికారి కూడా వ్యవసాయ పరిశ్రమలు, హోటళ్లలో తనిఖీలను వెంటనే ఆపేయాలని స్థానిక అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికార ప్రకటన రాలేదు. కాగా అక్రమ వలసదారులను అరెస్టు చేసేందుకు ఐసీఈ అధికారులు గత శుక్రవారం లాస్ ఏంజిల్స్‌లోని డౌన్‌టౌన్‌లో సోదాలు ప్రారంభించడంతో నిరసనలు మొదలయ్యాయి. ఆ తర్వాత ఆ నిరసనలు దేశమంతటా విస్తరించాయి. ఈ క్రమంలో లాస్ ఏంజిల్స్‌లో ట్రంప్ భారీ స్థాయిలో నేషనల్ గార్డులను మోహరించారు. దాంతో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలోనే నిరసనకారులను అడ్డుకునేందుకు మరో రెండు వేల మంది నేషనల్ గార్డులను మోహరించాలని ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఈ చర్యను కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్, లాస్ ఏంజిల్స్ మేయర్ కరెన్ బాస్‌తోపాటు స్థానిక పోలీసు అధికారులు వ్యతిరేకించారు. గవిన్ దీనిపై ఫెడరల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా అధ్యక్షుడి ఆదేశాలు చెల్లవని న్యాయస్థానం స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ ఇప్పుడు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

## ఆధార్ యూజర్లకు గుడ్‌న్యూస్

### మరోసారి అప్‌డేట్ గడువు పొడిగించిన ఉడాయ్..!

దేశంలోని కోట్లాది మంది ఆధార్ కార్డ్ యూజర్లకు ఉడాయ్ మరోసారి భారీ ఉపశమనం కలిగించింది. ఆధార్ కార్డులోని వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు గడువును మరోసారి పొడిగించింది. గతంలో జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆధార్ అప్‌డేట్‌కు చివరి తేదీ జూన్ 14 వరకు ఉండేది. కానీ, దాన్ని జూన్ 14 2026 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఉడాయ్ ఈ విషయాన్ని వెల్లడించింది. దాంతో యూజర్లు మరో సంవత్సరం పాటు ఆధార్ తమ వివరాలను అప్‌డేట్ చేసుకునే సదుపాయం లభించనున్నది. ఈ నిర్ణయంతో లక్షలాది మందికి ఉపయోగకరంగా ఉంటుందని ఉడాయ్ పేర్కొంది. ఆధార్‌ను ఎవరైనా యూజర్లు తమ తాజా సమాచారంతో అప్‌డేట్ చేసుకునేందుకు అవసరమైన డాక్యుమెంట్లను 'మై ఆధార్' పోర్టల్ ద్వారా ఉచితంగా అప్‌లోడ్ చేసుకునేందుకు వీలుంది. ప్రస్తుతం ఉన్న డేటాలో ఏవైనా మార్పులుంటే చేసుకునేందుకు ఉడాయ్ అవకాశం కల్పిస్తున్నది. ఇందులో భాగంగా యూజర్లు అడ్రస్‌ను ఉచితంగా మార్చుకోవచ్చు. వాస్తవానికి వివాహం జరిగిన వారు.. వలస వెళ్లేవారు..




ఉద్యోగరీత్యా వివిధ చోట్లకు వెళ్లేవారు చిరునామా మారుతూ వస్తుంటుంది. ఈ క్రమంలో వీరికి ఉడాయ్ నిర్ణయంతో వీరందరికీ ఎంతో ఉపయోకరంగా ఉండనున్నది. వాస్తవానికి ఆధార్ తీసుకొని పదేళ్లు పూర్తయిన వారంతా తప్పనిసరిగా తమ ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ సూచించిన విషయం తెలిసిందే. గతంలో ఈ ప్రక్రియ కోసం ఆధార్ కేంద్రాల్లో రూ.50 వసూలు చేసే వారు. అదే అవకాశాన్ని ఆన్‌లైన్‌లో ఉచితంగా చేసుకునేందుకు ఉడాయ్ వీలుకల్పిస్తున్నది.

### ఆధార్‌ను అప్‌డేట్ చేయడం ఇలా..

మొదట ఉడాయ్ అధికారిక వెబ్‌సైట్ myaadhaar.uidai.gov.inలోకి లాగి కావాలి. మొదట మీ ఆధార్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. మీ ఆధార్ ఎన్‌రోల్ సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేసి లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. లాగిన్ అయ్యాక మీ ఆధార్ వివరాలు కనిపిస్తాయి. వివరాలు అన్నీ సరైనవా కాదా? చూసుకోవాలి. ఏవైనా తప్పులుంటే మార్పులు చేసుకోవాలి. వివరాలు అన్నీ సరిగ్గా ఉంటే నెక్స్ట్ బటన్‌పై క్లిక్ చేయాలి. అయితే, ఏవైనా మార్పులు ఉంటే.. అందుకు సంబంధించిన వివరాలను మార్చుకొని.. అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసి తర్వాత సబ్మిట్ బటన్‌పై క్లిక్ చేయాలి. అప్‌డేట్ చేసిన తర్వాత 14 అంకెల రిక్వెస్ట్ పిన్ నంబర్ వస్తుంది. ఈ నంబర్ సహాయంతో ఎప్పటికప్పుడు మీ ఆధార్ అప్‌డేట్ వివరాలను చెక్ చేసుకునేందుకు వీలుంటుంది.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | ఆదివారం, హైదరాబాద్ | 15-06-2025
ANN తెలుగు

## శ్రీలీల బర్త్ డే స్పెషల్..

### సర్‌ప్రైజ్ ఇచ్చిన ఉస్తాద్ భగత్ సింగ్ టీం

టాలీవుడ్ టాప్ హీరోయిన్స్‌లో ఒకరిగా ఉన్న శ్రీలీల ప్రేక్షకులకి ఎలాంటి ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'పెళ్లి సందడి' సినిమాతో టాలీవుడ్‌లో అడుగు పెట్టిన ఈ ముద్దుగుమ్మ వరుస సినిమాలతో తెగ రచ్చ చేస్తుంది. గత ఏడాది ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబుతో కలిసి గుంటూరు కారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ధమాకా విజయంతో శ్రీలీలకి చాలా ఆఫర్స్ వచ్చాయి. టాలీవుడ్‌లో ఒకానొక సమయంలో ఏకంగా అర డజను సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. ఇప్పటికి కూడా శ్రీలీల చేతిలో ఏకంగా మూడు నాలుగు సినిమాలు ఉన్నాయి. ఇటీవల కోలీవుడ్ నుంచి కూడా ఆఫర్‌ను సొంతం చేసుకుంది.ఈ రోజు శ్రీలీల బర్త్ డే కాగా, ఆమెకి ప్రముఖులు, నెటిజన్స్ బర్త్ డే శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో ఉస్తాద్ భగత్ సింగ్ చిత్ర బృందం ఓ స్పెషల్ పోస్టర్ ద్వారా బర్త్‌డే విషెస్ తెలియజేసింది. ఈ పోస్టర్‌లో శ్రీలీల చాలా క్యూట్‌గా కనిపిస్తోంది. చేతిలో కాఫీ కప్ పట్టుకుని నిలుచొని సింపుల్ లుక్‌తో అదరగొడుతుంది. శ్రీలీల లుక్ తన అభిమానులని ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఇటీవలే పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సెట్‌లో అడుగుపెట్టగా, ఆయనతో పాటు శ్రీలీల కూడా జాయిన్ అయింది. వీలైనంత త్వరగా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారు. ప్రస్తుతం శ్రీలీల చాలా బీజీగా ఉంది. ఆమె చేతిలో అరడజను పైగా సినిమాలు ఉన్నాయి. మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న 'మాస్ జాతర', అక్కినేని అఖిల్ సరసన 'లెనిన్', తమిళంలో శివ కార్తికేయన్ సరసన 'పరాశక్తి', హిందీలో కార్తీక్ ఆర్యన్‌కు జోడీగా 'ఆషిఖి 3', కిరీటి రెడ్డి హీరోగా తెలుగు, కన్నడ ద్విభాషా చిత్రం 'జూనియర్' చిత్రాల్లో శ్రీలీల నటిస్తోంది. ఇందులో రెండు మూడు సినిమాలు హిట్ అయిన ఇక శ్రీలీలకి తిరుగు లేదు.







## రెండు గంటలు... ఏడు ప్రాజెక్ట్‌లు!

ఎనిమిది పదుల వయసులో ఎంతో చురుకుగా సినిమాలు, వాణిజ్య ప్రకటనలు, టీవీ షోలు చేస్తూ బిజీ బిజీగా ఉంటున్నారు అమితాబ్ బచ్చన్. వేగంగా పని చేయడం తనకు ఇష్టం అంటున్నారు ఈ బిగ్ బి. అందుకు ఉదాహరణగా ఇటీవల తాను రెండు గంటల్లో ఏడు ప్రాజెక్ట్‌లు (ఐదు వాణిజ్య ప్రకటనలు, రెండు ఫొటోషూట్‌లు) చేసిన విషయం గురించి చెప్పారు. "ఈ మధ్య నేను రెండు గంటల్లో ఏడు ప్రాజెక్ట్‌లు చేయడంతో నా డైరెక్టర్ ఫ్రెండ్ ఒకరు 'ఇలా పని చేయడం సరి కాదు. ఒక్క రోజులో పూర్తి చేయాల్సిన పనిని నువ్వు రెండు గంటల్లో పూర్తి చేస్తే ఎలా? నువ్వు పని విధానాన్నిపాడు చేస్తున్నావు. ఇలా చేస్తే క్లైంట్‌లు ఒకే రోజులో ఎక్కువ ప్రాజెక్ట్‌లు చేయమంటారు. అది కరెక్ట్ కాదు' అని చమత్కారంగా అన్నాడు. ఆ మాటలు నాకు చాలా ఆనందాన్నిచ్చాయి. నాకు ఇలా స్పీడ్‌గా పని చేయడం ఇష్టం" అని పేర్కొన్నారు అమితాబ్ బచ్చన్.

## నిధి అన్వేషణ కోసం ఆఫ్రికా అడవుల్లోకి మహేశ్ ఎంట్రీ



మహేశ్ బాబు కథానాయకుడిగా దర్శకుడు రాజమౌళి తీస్తున్న చిత్రం పనులు స్పీడ్ అందుకున్నాయి. కొద్దిరోజుల క్రితం ఒడిసాలో చిత్రీకరణ జరుపుకున్న ఈ భారీ ప్రాజెక్ట్ అక్కడ కొన్ని కీలక సన్నివేశాలతోపాటు, యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కించారు. మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్నా చిత్ర యూనిట్ ఇప్పుడు ఆఫ్రికాలోని అటవీ ప్రాంతాల్లోకి షిఫ్ట్ అవుతుంది. కథ రీత్యా ఈ సినిమాలోని అత్యంత కీలకమైె సీన్స్ ఇక్కడ షూట్ చేయనున్నారని తెలుస్తోంది. SSMB29 టీమ్ జులైలో కెన్యాకు పయనమయ్యేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. అక్కడ మసాయిపిగ్మీస్ తెగలతో ఇప్పటికే మహేశ్‌బాబు కొద్దిరోజులు గడిపారు. ఆ ప్రాంతపు యుద్ధ విద్యలపై బేసిక్ స్పెషల్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్టు తెలుస్తుంది. అక్కడి షెడ్యూల్ ఎప్పుడో పూర్తి కావాల్సి ఉంది. పలు కారణాల వల్ల ఆలస్యమైంది. ఇప్పుడు అక్కడికి వెళ్లేందుకు కావాల్సిన అన్ని అనుమతులు కూడా తీసుకున్నారట. దాదాపు 30రోజుల పాటు జరగనున్న షూటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేసేశారట. అక్కడి ప్రఖ్యాత అంబోసెలి నేషనల్ పార్క్‌లో కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. కెన్యాలో జరిగే ఈ షెడ్యూల్‌లో ప్రియాంక చోప్రా సెట్స్‌లో అడుగుపెట్టనుంది. మహేశ్, పృథ్వీరాజ్ సుకుమార్‌తో పాటు మరికొందరు అక్కడ షూటింగ్‌లో పాల్గొననున్నారు. ఇక ఈ సినిమాకు 'మహారాజా', 'మహారాజ్' అనే టైటిల్స్‌ను అనుకుంటున్నారని, 18వ శతాబ్దం నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని, ఓ నిధి అన్వేషణతో ఈ సినిమా ఉంటుందనీ వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

## అనిరుధ్-కావ్య మారన్‌కి త్వరలో పెళ్లి?

సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడు ఏదో ఒక పెళ్లి రూమర్ వినిపిస్తూనే ఉంటుంది. అయితే కొన్నిసార్లు నమ్మాలనిపించదు. మరికొన్నిసార్లు మాత్రం నిజంగా ప్రేమించుకుంటున్నారా? పెళ్లెప్పుడు చేసుకోబోతున్నారు అనిపిస్తుంది. ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో అలాంటి ఓ గాసిప్ ఫుల్‌గా వైరల్ అవుతోంది. అదే లేటెస్ట్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ పెళ్లి? తెలుగు, తమిళంతో పాటు హిందీలోనూ మంచి పాపులారిటీ సంపాదించుకున్న అనిరుధ్.. గతంలో ఆండ్రియా, కీర్తి సురేశ్ లాంటి హీరోయిన్లతో డేటింగ్ చేశాడనే వార్తలొచ్చాయి. అందుకు సంబంధించిన ఫొటోలు కూడా కొన్ని వైరల్ అయ్యాయి. కానీ కాలక్రమేణా వాటి గురించి జనాలు మర్చిపోయారు. సడన్‌గా ఇప్పుడు సరికొత్త రూమర్స్ వినిపిస్తున్నాయి. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకి యజమానిగా వ్యవహరిస్తున్న కావ్య మారన్‌ని అనిరుధ్ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నాడని అంటున్నారు. 2014 నుంచి వీళ్లిద్దరూ ప్రేమలో ఉన్నారని, కానీ ఈ విషయం బయటపడకుండా సైలెన్స్ మెంటైన్ చేశారని.. త్వరలో మాత్రం పెళ్లి చేసుకుంటారనే పుకార్లు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇద్దరూ తమిళవాళ్లు కావడంతో ఇది నిజమేనేమోనని చాలామంది అనుకుంటున్నారు. ప్రస్తుతానికైతే ఇరువైపుల నుంచి ఎలాంటి ఖండన లేదు. అలా అని అంగీకారం కూడా లేదు. కాబట్టి ఇప్పటివరకు అయితే ఇది రూమర్ మాత్రమే. అనిరుధ్ విషయానికొస్తే టీనేజీలోనే సంగీత దర్శకుడిగా కెరీర్ ప్రారంభించాడు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మోస్ట్ పాపులర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా క్రేజ్ సొంతం చేసుకున్నాడు. కావ్య మారన్ విషయానికొస్తే.. సన్ గ్రూప్ అధినేత కళానిధి మారన్ కూతురు. ఇప్పటికే తండ్రితోపాటు పలు వ్యాపారాల్లో కీలకంగా ఉంది. వీటితో పాటు ఐపీఎల్‌లోనూ హైదరాబాద్ జట్టుకి యజమానిగా వ్యవహరిస్తోంది.





## అజిత్‌కి జోడీగా...

స్టార్ హీరో అజిత్‌కి జోడీగా శ్రీనిధీ శెట్టి నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి తమిళ చిత్ర వర్గాలు. యశ్ హీరోగా రూపొందిన కన్నడ చిత్రం 'కేజీఎఫ్: చాప్టర్ 1'తో హీరోయిన్‌గా పరిచయమయ్యారు శ్రీనిధీ శెట్టి. ఆ సినిమాపాన్ ఇండియా హిట్ కావడంతో ఈ బ్యూటీకి ఫుల్ క్రేజ్ నెలకొంది. ఆ తర్వాత ఆమె నటించిన 'కేజీఎఫ్: చాప్టర్ 2', తమిళ చిత్రం 'కోబ్రా' మంచి విజయాలు సాధించాయి. నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన 'హిట్: ది థర్డ్ కేస్' సినిమాతో తెలుగుకి పరిచయమయ్యారు శ్రీనిధి. ఈ చిత్రంలో తనదైన నటన, యాక్షన్ సన్నివేశాలతో ఆకట్టుకున్నారామె. ప్రస్తుతం తెలుగులో సిద్ధు జొన్నలగడ్డకి జోడీగా 'తెలుసు కదా' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి నీరజ కోన దర్శకత్వం వహిస్తున్నారు. ఇదిలా ఉంటే... అజిత్ కుమార్‌తో నటించే క్రేజీ చాన్స్‌ను శ్రీనిధి అందుకున్నట్లు టాక్. అజిత్ నటిస్తున్న 64వ సినిమాలో ఆమెను కథానాయికగా ఎంపిక చేశారని సమాచారం. అజిత్‌తో 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి సినిమా తెరకెక్కించిన అధిక్ రవిచంద్రన్ 'ఏకే 64' (వర్కింగ్ టైటిల్)కి దర్శకత్వం వహిస్తారని కోలీవుడ్ టాక్. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ నవంబరులో ఆరంభం అవుతుందట. 2026 వేసవిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి... అజిత్‌కి జోడీగా శ్రీనిధి నటిస్తారా? లేదా అనే విషయం తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com